
- నేటి నుంచి గ్రామాల్లో వైద్య శిబిరాలు
- ఉచితంగా పరీక్షలు, టీకాలు, శస్త్రచికిత్సలు
- పశుసంవర్ధకశాఖ నేతృత్వంలో 31 వరకు నిర్వహణ
- పెంపకందారులు వినియోగించుకోవాలని సూచన



పశు వైద్యానికి.. పెద్దపీట

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం.. పాడి పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే మినీ గోకులాల నిర్మాణాలను ప్రోత్సహిస్తోంది. గోకులాలను పశువుల పెంపకందారులకు 90 శాతం రాయితీపై నిర్మిస్తోంది. గేదెలు, గొర్రెలు, మేకల పెం పకానికి ఊతం ఇస్తోంది. పాడి రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ప్రత్యేక కార్యక్రమాలను కూడా చేపట్టింది. పశు పెం పకందారులకు, పశు పోషకులకు మేలు చేసే దిశగా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో పశు వుల వైద్యానికి కూటమి ప్రభు త్వం పెద్దపీట వేస్తోంది. పశువులను వైద్యశాలలకు తీసుకు వచ్చేందుకు ఎన్నో వ్యయప్రయాసలకు గురవు తున్నారు. ఈ పరిస్థితుల్లో పశువులను వైద్యశా లలకు తీసుకురావాల్సిన అవసరం లేకుండానే వైద్య సేవలను వారి ముంగిట్లో అందుబాటు లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో పశు ఆరోగ్య శిబిరాలను అన్ని గ్రా మాల్లో నిర్వహించనున్నారు. ఇందుకు పశుసం వర్ధక శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో సోమవారం నుంచి వైద్య శిబిరాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 31 వరకు వైద్య శిబిరాలను నిర్వహిస్తారు. పశుసంవర్ధకశాఖ సిబ్బంది బృందాలుగా ఏర్పడి సహాయ సంచాలకులు, పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకుల ఆధ్వర్యంలో శిబిరాలు నిర్వహిస్తారు. ప్రతి బృందంలో వెట ర్నరీ అసిస్టెంట్ సర్జన్, సిబ్బంది ఈ బృందంలో ఉంటారు. ప్రతి మండలంలో రోజుకు రెండు నుంచి మూడు గ్రామాల్లో శిబిరాలు నిర్వహించనున్నారు. వైద్య శిబిరాలను పెంపకందారులు వినియోగించు కోవాలని అధికారులు కోరారు.

టీకాలు కూడా ఉచితంగానే..

వైద్య పరీక్షలతో పాటు అవసరమైన మందులు, టీకాలు, శస్త్ర చికిత్సల సేవ లను ఆయా శిబిరాల్లో ఉచితంగా అంది స్తారు. ప్రతి ఒక్క గ్రామంలో అన్ని పశు వులు ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, చిన్నదూడలకు వైద్యం అందిస్తారు. వైద్య శిబిరాలను పశు పోషకులు, పెంపకందా రులు సద్వినియోగం చేసుకునేలా గ్రా మాల వారీగా పశుసంవర్ధకశాఖ సి బ్బంది ప్రచారం నిర్వహిస్తోంది. పశు వులను వైద్యులచే పరీక్షించి ఉచితంగా వైద్యంతో తేలికపాటి శస్త్రచికిత్సలు అక్కడికక్కడే చేసేలా ఏర్పాట్లు చేస్తు న్నారు. శిబిరాల్లో అన్ని రకాల గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి తగువైద్యం అందించనున్నారు. పశువు లు, చిన్న దూడలు, సన్నజీవాలకు (గొర్రెలు, మేకలకు) నట్టల నివారణ మందు ఉచితంగా తాగిస్తారు. పశు ఆరోగ్య సంరక్షణలో భాగంగా అన్ని గ్రా మాల్లో సామూహికంగా పశువులకు (ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు) వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేస్తారు.

స్లీపర్ బోగీలూ.. కిటకిటే

కాలు తీసి కాలు పెట్టేందుకు వీలుండదు.. స్టేషన్ వచ్చి దిగే ప్రయాణికులు, ఎక్కే ప్రయాణికుల పోరాటాలు.. ఇదీ జనరల్ బోగీల్లో కనిపించే దృశ్యాలు. ప్రయాణికులు రైలు ఎక్కలేక ప్రయాణాల్ని విరమించుకో వడం.. గమ్యస్థానంలో దిగలేక పోవడం ప్రయాణికులకు పరిపాటిగా మారుతోంది. ఇలాంటి ఇబ్బందులు లేకుండా భారమైనా పలువురు రిజర్వేషన్లు చేసుకుని ప్రయాణాలు చేస్తున్నారు. అయితే జనరల్ బోగీల్లోకంటే దారు ణంగా రిజర్వుడు బోగీల్లో పరిస్థితి నెలకొందంటే ఆశ్చర్యం కాదు. కరోనా తర్వాత నుంచి ప్రయాణి కులకు రైలు ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. అయినా రైల్వే అధికారుల తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- జనరల్ బోగీల కంటే పరిస్థితి ఘోరం
- రిజర్వేషన్ టిక్కెట్ లేకుండానే ప్రయాణికుల ప్రవేశం
- టాయ్‌లెట్లకూ వెళ్లలేకపోతున్న రిజర్వుడ్ ప్రయాణికులు

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దూర ప్రాంతాల నుంచి గుంటూరు మీదగా రాకపోకలు సాగించే రైళ్లలో స్లీపర్‌క్లాస్ కోచ్‌లు జనరల్ బోగీల కంటే ఘోరంగా ఉంటున్నాయి. రిజర్వుడ్ బోగీల్లోకి ఎవరంటే వారు ఎక్కేస్తున్నారు. ఫుట్‌బోర్డులు, టాయ్‌లెట్స్, కోచ్ మధ్యలో ఉండే దారి, కంపార్టు మెంట్లలో ఎక్కడ ఖాళీ కనిపిస్తే అక్కడ కూర్చుంటూ రిజర్వుడ్ ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మహిళలు, వృద్ధులు, షుగర్ వ్యాధిగ్ర స్తులు, పిల్లలు అత్యవసరమై కనీసం టాయ్‌లెట్స్‌కు కూడా వెళ్లలేని పరిస్థితి స్లీపర్‌క్లాస్ బోగీల్లో నెలకొంటున్నది. జనరల్ బోగీల్లో ఎక్కలేని వారంతా సమీపంలోని రిజర్వుడు బోగీలను ఆశ్రయిస్తున్నారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా రైళ్లను, బోగీలను పెంచాల్సిన రైల్వే ఆ విషయాన్ని మరిచింది. గుంటూరు మీదగా ఒడిస్సా బెంగాల్, ఈశాన్య రాష్ట్రాల నుంచి ఎక్కు వ మంది విశాఖ, ఫలక్‌నుమా, షాలిమార్, వాస్కో డిగామా, సిల్చార్, ప్రశాంతి, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం, శబరి, అమరావతి, బెంగళూరు, హుబ్లీ, తిరువనంతపురం వైపు వెళ్లే రైళ్లలో అత్యధికంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వాసులు ప్రయాణిస్తుంటారు. గతంలో రిజర్వుడ్ బోగీల్లో కేవలం కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్ ప్రయాణికులు మాత్రమే ఎక్కేవారు. వెయిటింగ్ లిస్టు టిక్కెట్ ఉన్న వారికి ఎక్కడైనా ఖాళీలుంటే టీటీఈలు సీట్లు కేటాయించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి ఏ ఒక్క రైలులోనూ కనిపించడం లేదు. పండుగ సెలవుల రద్దీ సీజన్‌లోనే కాకుండా సాధారణ రోజుల్లోనూ రిజర్వుడు బోగీలు కూడా కిటకిటలాడు



స్లీపర్ క్లాస్ బోగీలో పరిస్థితి

తున్నాయి. స్లీపర్‌క్లాస్‌లో టిక్కెట్లు బుకింగ్ చేసుకోవడానికి భయపడిపోతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ప్రయాణికుల బాధ వర్ణనాతీతం

అనధికార వ్యక్తులు స్లీపర్‌క్లాస్‌లో చేరడంతో సౌకర్యాలు, భద్రతపరంగా ఇబ్బంది పడుతున్నామని ప్రయాణికులు మొర పెట్టుకుంటున్నా అటు ఆర్‌పీఎఫ్ ఇటు రైల్వే కమర్షియల్ విభాగం అధికారులు ఆలకించడం లేదు. ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చే ప్ర యాణికుల్లో ఎక్కువ మంది గుట్కా, జర్దా నములుతుంటారు. వారు అలానే బోగీల్లో ఎక్కడపడితే అక్కడ ఉమ్మి వేస్తూ ఇతరులకు నరకం చూపిస్తున్నారు. అదేమని ఎవరైనా ప్రశ్నిస్తే వారంతా ఒక్కటై తిరగబడుతున్నారు. ప్రయాణికులు ట్విట్టర్, ఇతర కంప్లయింట్ నంబర్లకు నివేదించినా ఫలితం శూన్యం.

క్రమక్రమంగా స్లీపర్‌క్లాస్‌ల కనుమరుగు

రైళ్లలో మధ్యతరగతి వర్గాల ప్రజలకు క్రమక్రమంగా స్లీపర్‌క్లాస్ బోగీలు కనుమరుగు అవుతు న్నాయి. గతంలో ఒక్కో రైలుకు కనీసం 12 నుంచి 14 స్లీపర్‌క్లాస్‌లు ఉండేవి. ఇప్పుడు కొన్ని రైళ్ల మినహా అన్నింటిలో మూడు, నాలు గుకు కుదించేశారు. వాటి స్థానంలో త్రీటైర్, టూటైర్, త్రీఏ ఎకానమి బోగీలను తీసుకొచ్చి ప్రయాణికులపై మూడింతల భారాన్ని మోపుతున్నారు. ఇటీవల కాలంలో ఏసీ త్రీటైర్‌లోనూ అనధికార వ్యక్తులు ప్రవేశిస్తున్న సంఘటనలు భయపడుతున్నాయి.

ప్రమాదం జరిగితే అంతే సంగతులు...

ఇటీవల కాలంలో ఒడిస్సా, బెంగాల్ రాష్ట్రాల్లో రైళ్ల ప్రమాదాలు జరిగినప్పుడు భారీగా ప్రాణనష్టం సంభవించింది. అందుకు అనధికార వ్యక్తులు ఎక్కువ సంఖ్యలో స్లీపర్‌క్లాస్‌లలో ఉండటం కూడా ఒక కారణం. కాగా ఏదైనా ప్రమాదం జరిగితే రిజర్వుడ్ ప్రయాణికులను సులభతరంగా గుర్తించవచ్చు. ఇందుకు కార ణం వారి పేర్లు, ఫోన్ నంబరు రైల్వే వద్ద నమోదై ఉంటుంది. టీటీఈలు ఈఎఫ్‌టీలు రాస్తున్న అనధికార వ్యక్తులకు సంబం ధించి ఎలాంటి సమాచారం అందుబాటులో ఉండదు. అప్పుడు వారి కుటుంబాలకు క్లెయిమ్‌లు చేయాలన్నా కుదరని పరిస్థితి. భద్రత విషయంలో కఠినంగా ఉండాలని రైల్వే జీఎం చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు.

టార్గెట్లతోనే తంటా..

కేవలం కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్లు కలిగిన ప్రయాణికులను మాత్రమే అనుమతించాల్సిన బోగీల్లోకి ఎవరిని పడితే వారిని ట్రావెలింగ్ టిక్కెట్ ఎగ్జామినర్(టీటీఈ)లు ఎక్కించేస్తున్నారు. వారికి కేటాయిం చిన పెనాల్టీల లక్ష్యాన్ని అధిగమించడానికి దీనిని అవకాశంగా చేసుకుం టున్నారు. కొన్ని రైల్వేస్టేషన్లలో అయితే టీటీఈలు ప్లాట్‌ఫాం నిలబడి వారే పెనాల్టీ కట్టించుకుని లోపలికి వెళ్లి ఎక్కడో ఒక చోట కూర్చోమని సలహా ఇస్తున్నారు. ప్రతీ టీటీఈ/స్క్వాడ్ రోజు/నెలకు ఇంత మొత్తం పెనాల్టీ రూపంలో వసూలు చేయాలని రైల్వే కమర్షి యల్ విభాగం అధికారులు టార్గెట్లు పెడుతున్నారు. వాటిని చేరుకో కపోతే మందలింపులు ఎదుర్కోవాల్సి వస్తుండటంతో స్క్వాడ్/టీటీఈలు సులభంగా ఉండే ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. టిక్కెట్ లేకుండా ఎక్కినా ఫైన్ రాసి ఇస్తున్నారు. ఒక్కో టీటీఈ రో జుకు రూ.25 వేలకు పైగా ఇలా ఫైన్ల రూ పంలో వసూలు చేస్తున్నారు.

తవ్వుతాం.. తరలిస్తాం

- కోనూరులో ఆగని ఇసుక దందా
- పట్టీపట్టనట్లుగా అధికారులు
- పొందుగల వద్ద మాత్రమే అధికారిక రీచ్
- స్పష్టం చేస్తున్న మైనింగ్ అధికారులు



ఇసుక లోడింగ్‌కు వినియోగిస్తున్న ఎక్స్‌కవేటర్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మా ఇష్టం.. ఇసుక తవ్వుతాం.. తరలిస్తాం.. అమ్ముకుంటాం. ఆపే దమ్ము ఎవరికి ఉంది. కోనూరు మాదే. ఇక్కడ ఎవరూ అడుగు పెట్టలేరు.. ఇదీ ఇసుకాసురుల తీరు. వారు చెప్పినట్లే ఏ ఒక్క అధికారి ఇసుక అక్రమ తవ్వకాలపై కన్నెత్తి చూడటం లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే కృష్ణానదిలోని ఇసుకను ఇసుకాసురులకు అధికారులు రాసిచ్చేశార న్నట్లుగా పరిస్థితి మారింది. పల్నాడు జిల్లా పరిధిలో పొందుగుల వద్ద మాత్రమే అధికారి కంగా ఇసుక రీచ్ ఉందని మైనింగ్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయితే అచ్చంపేట మం డలం కోనూరు వద్ద ఊహకు అందనంతగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లకు యంత్రాల ద్వారా లోడింగ్ చేస్తున్నారు. దాదాపు నదిలో కిలో మీటరు పొడవునా రోడ్డు నిర్మించుకుని ప్రతి రోజూ వందకు పైగా లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. ఏ శాఖాధికారులు కూడా ఇక్కడ ఇసుక అక్రమాలను ఆపే ప్రయత్నం చేయడంలేదు. విజిలెన్స్ నిఘా మచ్చుకైనా కనిపించడంలేదు.



నదిలో ఇకే దగ్గర ఇసుక లోడ్‌తో ఉన్న ఎనిమిది టిప్పర్లు

అటు ఎవరూ వెళ్ళకూడదు

ఇసుక తవ్వకాల ప్రాంతానికి ఎవరూ వెళ్లలేరు. ఎవరైనా అటు వైపు వెళితే ఎందుకు ఇక్కడకు వచ్చా రు.. ఇక్కడ ఉండటానికి వీలు లేదు.. వెళ్లాలి.. అంటూ ఇసుకా సురులు బెదిరింపులకు దిగుతు న్నారు. వైసీపీ హయాంలో ఇసుక అమ్ముకోలేదా.. అదే పని మేము చేస్తే తప్పేమిటని అధి కారులను వారు నిలదీస్తు న్నారు. ఇసుక జోలికి వెళ్లవద్దని టీడీపీ అధిష్ఠానం హెచ్చరిస్తు న్నా అక్రమార్కులు వినే పరిస్థి తులు లేవని అర్థమవుతోంది. ఇసుక జేబులు నింపుతుండటంతో మాఫియా తన సామ్రాజ్యాన్ని విస్తరిస్తోంది. నెలనెలా మామూళ్లు ఇస్తున్నాం.. తమపై అధికారులు చర్యలు తీసుకోరని ఇసుకాసురులు బహిరంగంగానే చెబుతున్నారు.

స్పందించని అధికారులు

కృష్ణానదిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలపై ఏ ఒక్క శాఖ చర్యలు తీసుకోవడంలేదు. నదీ గర్భాన్ని చీల్చుతూ రోడ్డు నిర్మిస్తే సంబంధిత శాఖ అధికారులు నేటి వరకు స్పందించలేదు. భారీగా ఇసుక తవ్వకాలు జరుగుతుంటే మైనింగ్ శాఖ తమ పని కాదన్నట్లుగా ఉంది. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న లారీలపై కేసులు నమోదు చేయాల్సిన పోలీసు, రవాణా శాఖలు చోద్యం చూస్తున్నాయి. ఇసుక మాఫియా హెచ్చరిస్తున్నట్లుగా అక్రమ తవ్వకాలపై కన్నెత్తి చూసే ప్రయత్నం కూడా ఏ శాఖాధికారులు చేయకపోవడాన్ని ఎలా చూడాలన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇక ఇసుక అక్రమాలకు అడ్డుకట్ట పడే పరిస్థితులు లేవనే చెప్పాలి.

7

మండాదిలో క్రీ.శ. 1359 నాటి శాసనం గుర్తింపు

రైలు నుంచి జారిపడి **వ్యక్తి మృతి**

- చెప్పు తీసుకునే క్రమంలో రెంటచింతలలో ఘటన

గ్రానైట్ సీజ్ చేశారు.. **వేలం మరిచారు**

- ఏడాదిగా రూరల్ పోలీస్ స్టేషన్‌లోనే నిల్వలు
- వాణిజ్య పన్నుల శాఖ నిర్లక్ష్యం

30 నుంచి.. రీసర్వే

- పునః ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి
- సభలు, ర్యాలీలతో ప్రజల్లో అవగాహన
- 25 నుంచి కార్యక్రమాలకు అధికారులు సిద్ధం
- వైసీపీ హయాంలో తూతూమంత్రం.. తప్పులేతప్పులు
- ఈసారి పొరపాట్లకు తావులేకుండా యజమాని, గ్రామస్థుల సమక్షంలో కొలతలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

హద్దులు మారిపోయాయి.. విస్తీర్ణం తగ్గిపో యింది.. వివరాల్లో తప్పులు.. ఇలా గత వైసీపీ హయాంలో భూముల సర్వే జరిగింది. వివాదాలు తగ్గించేందుకు అని చెప్పి చేపట్టిన సర్వే సరికొత్త సమస్యలను తీసుకొచ్చింది. సర్వే బాధితులు అధికా రులు, కార్యాలయాల చుట్టూ తిరిగినా అప్పట్లో కనికరించలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించాలని.. గత సర్వేలో చోటుచేసుకున్న తప్పులను సవరించాలని నిర్ణయిం చింది. ఈ క్రమంలో ఈ నెల 30వ తేదీ నుంచి రీ సర్వేకు సిద్ధమైంది. భూముల సమస్యల పరిష్కారా నికి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో భూ రీసర్వేను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహణకు అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. గ్రామ హద్దుల నిర్ధారణకు సంబంధించిన సర్వే జరుగుతోంది. భూ ముల యజమానులకు సర్వేపై అవగాహన కల్పిం చేందుకు 25వ తేదీ నుంచి 27 వరకు గ్రామ సభ లు.. ర్యాలీలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబం ధించి ప్రణాళికను సర్వే శాఖ సిద్ధం చేసింది. మండ లానికి ఒక గ్రామాన్ని రీసర్వేకు ఎంపిక చేశారు. ఇందు కోసం యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది.

వైసీపీ హయాంలో గందరగోళం..

వైసీపీ హయాంలో భూముల రీసర్వే అస్తవ్య స్తంగా.. గందరగోళంగా జరిగింది. పెద్దఎత్తున తప్పులు చోటు చేసుకున్నాయి. ఒక్కో మండలంలో ఒకేసారి ఐదారు రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేశారు. అధికారులు సిబ్బంది కొరతతో తూతూమంత్రంగా సర్వే చేయగా తప్పులు చోటుచేసుకున్నాయి. సర్వేలో వ్యత్యాసం ఉంటే యజమానిని సంప్రదించకుండా ఒకరికి ఎక్కువ ఒకరికి తక్కువగా భూమి ఎక్కిం చారు. ఫలితంగా ఎన్నడూ లేనంతగా భూ సమస్య లను రైతులు ఎదుర్కొ న్నా రు. కూటమి ప్రభుత్వం ఇటీ వల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలకు సంబంధించి వేలాది మంది బాధితులు అర్జీలు అందజేశా రు. ఈ పరిస్థితుల్లో గతంలో జరిగి నట్లు పొరపాట్లుకు తావులేకుండా, అత్యంత జాగ్రత్తగా రీసర్వే నిర్వ హించాలని యంత్రాంగాన్ని కూట మి ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో రీ సర్వేలో ఎటు వంటి లోపాలు తలెత్తకుండా పక్కా ప్రణాళికను అధికారులు సిద్ధం చేశారు. ఒక్కొక్క మం డలంలో ఒక్కో గ్రామంలోనే రీ సర్వే చేయనున్నారు. రీసర్వేకు ప్రత్యేకంగా బృందాలను కూడా నియమించారు. 200 నుంచి 250 ఎకరాలను ఒక బ్లాక్‌గా వి భజించగా ఒక్కో బ్లాక్‌కు ఒక బృందాన్ని కేటాయించారు. ఈ బృందంలో ఇద్దరు సర్వేయర్లు, గ్రా మ రెవెన్యూ అధికారి, గ్రామ సహా యకులు ఉంటారు. బృందానికి సాం కేతిక సిబ్బంది సహాయంగా ఉంటారు. పొలాల గట్లు, విస్తీర్ణం పక్కాగా కొలుస్తారు. ఎక్కడికక్కడ ప్రజలు, భూ యాజమానుల సమక్షంలోనే సర్వే చేయనున్నారు. ఇప్పటికే గ్రామ సరిహద్దులపై సర్వేశాఖ అధికారులు గుర్తిస్తున్నారు.



గ్రామ హద్దుల సర్వేను పరిశీలిస్తున్న సర్వే శాఖ ఏడీ కీర్తి

సర్వే నిర్వహించే గ్రామాలివే..

పల్నాడు జిల్లాలో 363 రెవెన్యూ గ్రామాలు ఉండగా వీటిలో తొమ్మిది అగ్రహార గ్రామాలు కాగా నాలుగు పులిచింతల ప్రాజెక్టు కిందకు వెళ్లాయి. పది గ్రామాలు పట్టణాలకు అనుబంధంగా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో 150 గ్రామాల్లో సర్వే జరిగింది. నరసరావుపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల్లో గతంలోనే రీసర్వే పూర్తయింది. మిగతా మండలాల్లో సర్వే చేపట్టనున్నారు. సర్వే జరగనున్న గ్రామాల వివరాలు ఇలా ఉన్నాయి. మాచర్ల మండలం ముత్యాలంపాడు, కారంపూడి మండలం చినకొదంగుండ్ల, రెంటచింతల మండలం మల్లవరం, గురజాల మండలం పల్లెగుంత, దుర్గి మండలం దుర్గి, పిడుగురాళ్ల మండలం జానపాడు, దాచేపల్లి మండలం పొందుగల, వెల్దుర్తి మండలం మండాది, బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం, సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి, క్రోసూరు మండలం అందుకూరు గ్రామాల్లో సర్వే జరగనుంది. అమరావతి మండలం నరుకుళ్లపాడు, పెదకూరపాడు మండలం లింగంగుంట్ల, ముప్పాళ్ల మండలం నార్నేపాడు, రాజు పాలెం మండలం గణపవరం, అచ్చంపేట మండలం కాస్టాల, నకరికల్లు మండలం చాగొల్లు, బొల్లాపల్లి మండలం సరికొండపాలెం, నూజెండ్ల మండలం త్రిపురాపురం, రొంపిచర్ల మండలం గోగులపాడు, చిలకలూరిపేట మండలం కావూరు, శావల్యాపురం మండలం కొత్తలూరు, ఈపూరు మండలం కొచ్చెర్ల, వినుకొండ మండలం ఏనుగుపాలెం గ్రామల పరిధిలో భూ రీ సర్వేకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి..

జిల్లాలో 25 గ్రామాల్లో సర్వేకు ఏర్పాట్లు చేశాం. చిన్న తప్పు కూడా దొర్లకుండా సర్వే చేస్తాం. ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహిం చి ప్రజలకు అవగాహన కల్పిస్తాం. భూముల సర్వే పునఃప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

-చేజర్ల భానుకీర్తి, భూమి, రికార్డులశాఖ ఏడీ

- ఐదు ఎకరాల విస్తీర్ణంలో చకచకా పనులు
- 26న గణతంత్ర వేడుకలు నిర్వహించే దిశగా పనులు

పోలీస్ కవాతు మైదానం సిద్ధం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో పోలీసు కవాతు మైదానం సిద్ధం అవుతోంది. పల్నాడు జిల్లాగా ఏర్పడి మూడో ఏడాది సమీపిస్తోంది. అయితే ఇంతవరకు సరైన కార్యాలయాలతో పాటు కీలకమైన పోలీసు విభాగానికి కూడా భవనాలు, పరేడ్ గ్రౌండ్ కూడా లేదు. ఈ క్రమంలో పోలీసులు కవాతుకు మైదా నానికి స్థలం కేటాయించాలని ఎస్పీ శ్రీనివాసరావు కలెక్టర్‌ను కోరారు. దీంతో లింగం గుంట్లలోని కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయాలకు సమీపంలోని జలవనరుల శాఖకు సంబంధించిన ఐదు ఎకరాల స్థలాన్ని పోలీసు పరేడ్ గ్రౌండ్‌కు కేటాయించారు. దీంతో ఇక్కడ పోలీసు కవాతుకు సంబంధించిన పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ మైదానంలోనే 26న గణతంత్ర వేడుకలను నిర్వహించాలని ఎస్పీ భావిస్తున్నారు. దీంతో పనులను వేగవంతం చేశారు. పోలీసులు కవాతు కోసం డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణానికి వెళ్లేవారు. స్వాతంత్ర, గణతంత్ర వేడుకలను కూడా స్టేడియంలోనే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎస్పీ శ్రీనివాసరావు కృషితో అన్ని వసతులతో పోలీసు కవాతు మైదానం రూపుదిద్దుకుంటోంది. ఈ మైదానంలో పోలీసులు డ్రిల్ చేసేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసు కవాతు మైదానం పనులపై ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. మైదానానికి ప్రహరి నిర్మాణం పూర్తయింది. మైదానంలో లెవలింగ్ పనులు చురుగ్గా జరుతున్నాయి.

పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్మాణ పనులు



దిక్సూచి
DIKSUCHI

ఇంటర్ ప్రాక్టికల్స్
ఇలా చేస్తే ఫుల్ మార్కులు



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసే విద్యార్థుల సంఖ్య దాదాపు ఇరవై లక్షలకు దగ్గరగా ఉంటుంది. దీనిలో సగం అంటే పది లక్షల వరకు ఇంటర్ రెండో సంవత్సరంలో ఉంటారు. ఇందులో అరవై, డెబ్బయి శాతం మంది ఎంపీసీ, బైపీసీ వారే.

జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలైన జేఈఈ, నీట్, బిట్‌శాట్‌లలో ఇంటర్ మార్కులకు వెయిటేజీ లేకపోయినా, టీఎస్, ఏపీ ఎప్‌సెట్‌లలో ఎంపీసీ, బైపీసీ సబ్జెక్టులకు 25 శాతం మెయిటేజీ ఉంటుంది. దీని కారణంగా ఇంటర్‌లో ప్రాక్టికల్స్‌కి ప్రాధాన్యం పెరిగింది. ఎంపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులలో 30 మార్కుల చొప్పున మొత్తం ప్రాక్టికల్స్‌కి 60 మార్కులు కేటాయించారు. బైపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల్లో 30 మార్కుల చొప్పున మొత్తం 120 మార్కులు కేటాయించడం జరిగింది.

● జాతీయస్థాయి పోటీ పరీక్షలపై దృష్టిపెట్టిన కొన్ని కాలేజీలు విద్యార్థులకు ప్రాక్టికల్స్ సరిగ్గా చేయించకుండా కేవలం పరీక్షలకు ముందు తూతూ మం త్రంలాగే నడిపించి పంపుతున్నారనే వార్తలు రావడంతో ఇంటర్మీడియెట్ బోర్డు ఈ ల్యాబ్ పరీక్షలను కూడా సీరియస్‌గా నిర్వహించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగానే సీసీటీవీల ఏర్పాటు, కచ్చితమైన అటెండెన్స్, ప్రశ్నపత్రం లీక్ కాకుండా జాగ్రత్తలతోపాటు, రికార్డు పుస్తకాలను సరిగ్గా వాల్యుయేట్ చేయించడం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.

● అయితే ల్యాబ్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అవుతున్న విద్యార్థుల కేవలం మార్కుల కోసమే కాకుండా కొంత సబ్జెక్టు నాలెడ్జ్ పెంచుకుంటే జేఈఈ, నీట్ పరీక్షల్లో కూడా ఉపయోగపడుతుంది. విద్యార్థులు ఈ కింది అంశాలపై దృష్టిపెడితే ప్రాక్టికల్స్‌లో పూర్తి స్థాయి మార్కులు సాధించవచ్చు.

1. **ప్రాక్టికల్ రికార్డ్ బుక్స్:** సిలబస్‌లో ఉన్న అన్ని ప్రయోగాలు, వాటి అబ్జర్వేషన్స్/ రిజల్ట్స్‌ను జాగ్రత్తగా రాయాలి. అయితే కొంతమంది విద్యార్థులు రికార్డు ఇంకొకరితో రాయిస్తారు. దీనివల్ల సబ్జెక్టు నాలెడ్జ్ పెరగకపోవడంతో, పరీక్షలో ఎగ్జామినర్ అడిగే ప్రశ్నలకు మార్క్స్‌పోగొట్టుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి రికార్డులు సొంతంగా రాయడం ఉత్తమం.
2. **ప్రయోగాల సూత్రాలు:** ఎక్విప్‌మెంట్స్ లేదా ఇన్‌స్ట్రుమెంట్స్‌తో ప్రాక్టికల్స్ చేస్తున్నప్పుడు ఆ ప్రయోగం వెనక ఉన్న ఫండమెంటల్స్‌ను, ఇన్‌స్ట్రుమెంట్స్‌ని, వాటి ఉపయోగాలను అర్థం చేసుకోవాలి. పక్కన ప్రయోగం చేస్తున్న విద్యార్థులను అనుకరించవద్దు.
3. **గ్రాఫ్ డ్రాయింగ్:** ఇది అతి ముఖ్యమైన అంశం. మీ ల్యాబ్ సిలబస్‌లో గ్రాఫ్స్ ఉన్నట్లయితే రికార్డ్ బుక్స్‌లో వాటిని జాగ్రత్తగా పొందుపర్చడంతో పాటు ఎగ్జామ్‌లో గీయాల్సి వస్తే, దానికి సంబంధించిన డేటాని సరిగ్గా విశ్లేషించాలి.
4. **డయాగ్రామ్స్:** బోటనీ, జువాలజీ ప్రయోగాలకు అవసరమైన డయాగ్రామ్స్‌ని కచ్చితంగా గీయడం నేర్చుకోవాలి. అంతే కాకుండా వాటి లేబులింగ్ స్పష్టంగా ఉండేలా చూసుకోవాలి.
5. **సేఫ్టీ:** మీ కాలేజీలో లాబ్స్ చేస్తున్నప్పుడు, పరీక్షలో కూడా కెమికల్స్, ఎలక్ట్రిసిటీకి సంబంధించిన ఇన్‌స్ట్రుమెంట్స్‌ని జాగ్రత్తగా హ్యాండిల్ చేయాలి. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే వెంటనే అక్కడ ఉన్న ఇన్‌స్ట్రక్టర్‌కి తెలపాలి.
6. **మాల్‌ఫంక్షనింగ్:** పరీక్షలో ఏదైనా కారణంగాఒక ఇన్‌స్ట్రుమెంట్ సరిగ్గా పనిచేయకపోతే వెం టనే ఎగ్జామినర్‌కి తెలిపి దానిని రిపేర్ చేయించుకోవడమో లేదా ఇన్‌స్ట్రుమెంట్ మార్చుకోవడమో చేయాలి.
7. **నమూనా పరీక్షలు - ముఖ్యమైన ప్రశ్నలు:** గత సంవత్సరాల ప్రశ్నలతో ఒక ఇంపార్టెంట్ క్వశ్చన్ బుక్‌లెట్ తయారు చేసుకోవాలి. పరీక్షకు ముందు ఈ ప్రశ్నలను తప్పకుండా రివిజన్ చేసుకోవాలి.
8. **వైవా - వాయిస్:** పరీక్ష రోజు ఎగ్జామ్ హాల్‌లో మీ ప్రవర్తన సరిగ్గా ఉండాలి. పక్కన విద్యార్థిని కాపీ చేయడం లేదా మెజర్‌మెంట్స్‌ని కాపీ చేయకూడదు. వైవాలో అడిగే ప్రశ్నలకు సరిగ్గా సమాధానం ఇవ్వాలి. ప్రశ్నలు ఎలా వస్తున్నాయనే విషయంలో మీ ముందు సెషన్‌లో పరీక్షకు వెళ్లిన విద్యార్థుల నుంచి కొంత ఫీడ్‌బాక్ తీసుకోవచ్చు, ఎలాంటి తొందరపాటు లేకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరైతే పూర్తి మార్కులు సాధించవచ్చు.

గుడ్‌లక్



డాక్టర్ పవన్‌కుమార్ కాసు, డైరెక్టర్
సంజీవని జూనియర్ కాలేజీ, హైదరాబాద్

SCHOLARSHIP ALERT
Kotak Suraksha



Description: Kotak Securities Limited (KSL) invites applications from students pursuing general/professional graduation.
Eligibility: Open to PwD applicants across India who are currently pursuing general or professional graduation courses. Applicants must have secured at least 55% marks in their previous academic year, and their annual family income must not exceed INR 3,20,000.
Prizes & Rewards: Scholarship up to INR 1,00,000 per year
Last Date to Apply: 23-01-2025
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/KSSP3

buddy4study.com

జాబ్ కార్నర్

హెచ్‌పీసీఎల్‌లో డిప్లొమా అభ్యర్థులకు..

మొత్తం ఖాళీలు
234

హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్) జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. డిప్లొమా చేసిన ఆసక్తి గల అభ్యర్థులు 2025 ఫిబ్రవరి 14వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

- **జూనియర్ ఎగ్జిక్యూటీవ్ (మెకానికల్):** 130 పోస్టులు
- **జూనియర్ ఎగ్జిక్యూటీవ్(ఎలక్ట్రికల్):** 65 పోస్టులు
- **జూనియర్ ఎగ్జిక్యూటీవ్(ఇన్‌స్ట్రుమెంటేషన్):** 37 పోస్టులు
- **జూనియర్ ఎగ్జిక్యూటీవ్(కెమికల్):** 2 పోస్టులు

అర్హత: పోస్టుకు సంబంధించిన బ్రాంచ్‌లో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా పూర్తి చేసి ఉండాలి.
వయస్సు: అభ్యర్థుల వయస్సు దరఖాస్తు దాఖలు చేసే తేదీ నాటికి 18-25 సంవత్సరాల మధ్యలో ఉండాలి.
ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక ఉంటుంది.
దరఖాస్తు విధానం: 2025 ఫిబ్రవరి 14 తేదీలోపు దరఖాస్తు దాఖలు చేయాలి.
పూర్తి వివరాల కోసం www.hindustanpetroleum.comలోCareers?Current Openings వెబ్‌పేజీ చూడవచ్చు.

ఇండియన్ ఆర్మీలో క్రీడా కోటా

ఇండియన్ ఆర్మీలో హవల్దార్, నాయబ్ సుబేదార్(క్రీడా కోటా) ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. అవివాహితులైన పురుష, మహిళా అభ్యర్థులు ఈ డైరెక్ట్ ఎంట్రీ ఉద్యోగాలకు 2025 ఫిబ్రవరి 28లోపు దరఖాస్తు చేసుకోవచ్చు.
క్రీడా విభాగాలు: అథ్లెటిక్స్, అర్చరీ, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, డైవింగ్, ఫుట్‌బాల్, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్స్ హాకీ, హ్యాండ్‌బాల్, జూడో, కయాకింగ్ అండ్ కెనోయింగ్, కబడ్డీ, స్విమ్మింగ్, సెయిలింగ్, షైటింగ్, ట్రయాథ్లాన్, వాలీబాల్, వుషు, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, రోయింగ్.
అర్హత: పది/ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు, నిర్దుష్టమైన శారీరక ప్రమాణాలు ఉండాలి. అంతర్జాతీయ/జూనియర్ లేదా సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్/ ఖేలో ఇండియా గేమ్స్/ యూత్ గేమ్స్/ ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో పాల్గొన్న క్రీడాకారులై ఉండాలి.
వయస్సు: పదిహేడున్నర సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 2000 మార్చి 31 నుంచి 2007 ఏప్రిల్ 1వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలి.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను డైరెక్టరేట్ ఆఫ్ పీజీ అండ్ స్పోర్ట్స్, జనరల్ స్టాఫ్ బ్రాంచ్, ఐహెచ్ క్యూ(ఆర్మీ), రూమ్ నెం.747, 'ఏ' వింగ్, సేనా భవన్, న్యూఢిల్లీ చిరునామాకు పంపించాలి.
పూర్తి వివరాలకు https://joinindianarmy.nic.in/Authentication.aspx వెబ్‌సైట్ చూడవచ్చు.



సుందరయ్య కళానిలయం జాతీయ ఆహ్వాన నాటికల పోటీలు

● ఏప్రిల్ 4,5,6 తేదీలలో యడ్లపాడులో నిర్వహణ


మాట్లాడుతున్న వేదిక అధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు, సమావేశంలో పాల్గొన్న సంయుక్త కార్యదర్శి నాగేశ్వరరావు, సభ్యులు రామారావు

యడ్లపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం జాతీయ స్థాయి ఆహ్వాన నాటికల పోటీలు ఏప్రిల్ 4, 5, 6 తేదీలలో నిర్వహిస్తున్నట్లు తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం(వేదిక), సుందరయ్య కళానిలయం నిర్వాహకులు ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. యడ్ల పాడులోని వేదిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళామతల్లి ముద్దుబిడ్డ పుచ్చలపల్లి సుందరయ్య పేరిట ఏటా యడ్లపాడులో పండుగ వాతావరణంలో నిర్వహించడం రెండు దశాబ్దాల నుంచి ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిసారి మాదిరిగానే పోటీల నిర్వహణ విభిన్నంగా, కొత్త తరహాలో కళాభిమానుల మదిని దోచుకునేలా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు కృషి చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే నాటికల పరిశీలన చేసి ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి తమ వేదికపై ప్రదర్శిస్తామన్నారు. ఈ సమావేశంలో వేదిక సంయుక్త కార్యదర్శి పోపూరి నాగేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం సభ్యుడు ముత్తవరపు రామారావు పాల్గొన్నారు.


రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో వాణిజ్య పన్నుల శాఖ సీజ్ చేసిన గ్రానైట్ నిల్వలు

గ్రానైట్ సీజ్ చేశారు.. వేలం మరిచారు

● ఏడాదిగా రూరల్ పోలీస్ స్టేషన్‌లోనే నిల్వలు
● వాణిజ్య పన్నుల శాఖ నిర్లక్ష్యం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వాహనాల తనిఖీల్లో భాగంగా అక్రమ రవాణా చేస్తున్న గ్రానైట్ లారీలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులు గతంలో స్వాధీనం చేసుకున్నారు. కొంత జరిమానాతో లారీలను వదిలేశారు. రూరల్ పోలీసుల భద్రతలో పోలీస్‌స్టేషన్ ఆవరణలో గ్రానైట్ నిల్వ చేశారు. దాదాపు ఏడాది నుంచి ఈ నిల్వలు ఇక్కడే ఉన్నాయి. అక్రమార్కులు పన్ను చెల్లించి గ్రానైట్‌ను తీసుకు వెళ్లలేదు. ఈ నేపథ్యంలో స్వాధీనం చేసుకున్న గ్రానైట్‌కు వేలం నిర్వహించాలి. అయితే, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు మాత్రం స్పందించడంలేదు. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు లారీల నుంచి ఈ నిల్వలను సీజ్ చేశారు. దీని విలువ సుమారు రూ.7 లక్షలు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వేలం నిర్వహిస్తే ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూరుతుంది.

మండాదిలో క్రీ.శ.1359 నాటి శాసనం గుర్తింపు

● చరిత్ర పరిశోధకుడు సతీష్‌బాబు

మాచర్లటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలంలోని మండాది గ్రామంలో క్రీ.శ. 1359 నాటి శాసనాన్ని గుర్తించినట్లు మాచర్ల పట్టణానికి చెందిన చరిత్ర పరిశోధకుడు, రచయిత పావులూరి సతీష్ తెలిపారు. మండాదిలోని ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఆలయం వద్ద రోడ్డు పక్కన పిచ్చి కంపల మధ్య శిథిలావస్థలో ఉన్న శిలాశాసనాన్ని ఆయన గుర్తించారు. ఈ సందర్భంగా సతీష్‌బాబు మాట్లాడుతూ ఈ శిలాశాసనం క్రీ.శ. 1359 నాటిదని, భారత పురావస్తు శాఖ 1930లో ఈ శాసనం నకలు తీశారన్నారు. ఈ శాసనంలో గ్రామంలోని మల్లికార్జునస్వామి సేవలు, వైభవాలకు తంగెడ మాచలనాయుడు కుమారుడు సిరిగిరి నాయుడు గ్రామాన్ని దత్తత ఇచ్చారని, ఆలయ కంభం మరమ్మతులకు గరైతే నూతన కంభం ఎత్తించాడని శాసనంలో ఉన్నట్లు చెప్పారు. ఈ శాసనబండ పక్కనే మరో చిన్న శిథిలశాసనం ఉందని, ఈ శాసనంలోని అక్షరాలు పూర్తిగా శిథిలమై చెరిగిపోయాయన్నారు. వారసత్వ సంపదను కాపాడుకోవాలని, శిథిలమవుతున్న శాసనాలను దేవాలయాల్లోకి మార్చి రక్షణ కల్పించాలని కోరారు.


శిలాశాసనాన్ని చూపుతున్న సతీష్‌బాబు

రైలు నుంచి జారిపడి తండ్రి మృతి

● చెప్పు తీసుకునే క్రమంలో రెంటచింతలలో ఘటన


తమ్మిశెట్టి ఏడుకొండలు

రెంటచింతల,జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులతో కిక్కిరిసి ఉన్న రైలు ఎక్కే క్రమంలో జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన రెంటచింతల రైల్వే ప్లాట్‌ఫారం వద్ద ఆదివారం ఉదయం జరిగింది. జీఆర్‌పీ(జనరల్ రైల్వే పోలీసు) ఎస్‌ఐ వెంకట్రామయ్య తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని పాలువాయికి చెందిన తమ్మిశెట్టి ఏడుకొండలు (42), చదువుకుంటున్న తన కూతురు స్రవంతితో కలిసి గుంటూరుకు బయలుదేరాడు. టిక్కెట్లు తీసుకున్న అనంతరం కూతురు స్రవంతి బోగీలోకి ఎక్కింది. ఏడుకొండలు కూడా రైలు ఎక్కే క్రమంలో ఆయన వేసుకున్న చెప్పు జారి కిందపోయింది. దీనిని తీసుకునే క్రమంలో నిదానంగా వెళ్తున్న రైలు కింద జారిపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తన తండ్రి రైలు కిందపడటంతో స్రవంతి ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండి పోయింది. గురజాల వరకు ప్రయాణించి రైలు దిగి ఘటనా స్థలానికి చేరుకుంది. ఏడుకొండలు ముఠా మేస్త్రీగా పనిచేస్తుంటాడు.కుమారుడు శ్యామ్ విజయవాడలో బీటెక్ చదువుతుండగా, కుమార్తె స్రవంతి గుంటూరు ఉమెన్స్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకులను సర్పంచ్ మందలపు విజయలక్ష్మి లచ్చిరెడ్డి ఓదార్చారు. నష్టపరిహారం విషయంపై రైల్వే అధికారులతో మాట్లాడారు.

సీఏ విద్యార్థి ఆత్మహత్య

● బ్రాడీపేటలోని లోటస్ బాలుర వసతి గృహంలో ఘటన
● మృతుడు నెల్లూరు జిల్లా గూడూరు వాసి


మృతుడు శివప్రసాద్

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాడీపేట 4/11లో ఉన్న లోటస్ బాలుర వసతి గృహంలో సీఏ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు పట్టణానికి చెందిన కె నాగ శివప్రసాద్ (24) అనే విద్యార్థి తాను ఉంటున్న హాస్టల్ గదిలో శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మహిళా ఎస్సై రోజాలత కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శివప్రసాద్ తండ్రి ప్రభాకర రాజు గూడూరులో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. శివప్రసాద్ ప్రస్తుతం బ్రాడీపేటలోని నాగార్జున సీఏ అకాడమిలో సీఏ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. కొద్ది నెలల్లో కోర్సు పూర్తి కాబోతోంది. ఇదిలాఉంటే శివప్రసాద్ సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్ళి నాలుగు రోజుల క్రితమే హాస్టల్‌కు వచ్చాడు. హాస్టల్ గదిలో తన క్లాస్‌మేట్ వేణుగోపాల్‌తో కలసి శివప్రసాద్ ఉంటున్నాడు. శనివారం రాత్రి 9.30 గంటల సమయంలో వేణుగోపాల్ స్టడీ అవర్‌కు వెళ్ళి ఆ తర్వాత తిరిగి వచ్చాడు. ఎంత కొట్టినా రూమ్ తలుపు తీయలేదు.లోపల గడియపెట్టి ఉండటంతో శివప్రసాద్ నిద్ర పోతున్నాడేమోనని భావించాడు. దీంతో, పక్క గదిలోకి వెళ్లి అతను పడు కున్నాడు. ఉదయం మరోసారి గది తలుపు తట్టినా తీయకపోవడంతో హాస్టల్ నిర్వాహకు లకు ఫిర్యాదు చేసి క్లాసుకు వెళ్ళాడు. హాస్టల్ నిర్వాహకులు తలుపు కొట్టినా తీయ లేదు. అనుమానం వచ్చి కిటికీ తలుపు పగలకొట్టి చూడగా ఫ్యాన్ హుక్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కని పించాడు. వెంటనే వారు పోలీ సులకు సమాచారం ఇచ్చారు. మహిళా ఎస్సై రోజాలత ఘటనా స్థలికి వెళ్లారు. తలుపులు పగలగొట్టి చూడగా అప్పటికే శివప్రసాద్ మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. శివప్రసాద్ గదిలోనూ, క్లాస్‌లోనూ ఎవరితోనూ కలవడని, ఎప్పుడూ ముభావంగా ఉంటాడని రూమ్ మేట్ చెప్పాడు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోలీసులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు వస్తే గానీ ఆత్మహత్యకు దారి తీసిన కారణాలపై స్పష్టత రానుంది.

అన్నప్రాసన పనులపై వెళుతూ
రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న చందోలు ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్, కొండవీటి వెంకటప్రసాద్ (ఫైల్)

పిట్టలవానిపాలెం, జనవరి 19 (ఆంధ్ర జ్యోతి) : ద్విచక్రవాహనంపై వెళుతున్న ఓ యువకుడు ట్రాక్టర్‌ను తప్పించబోయి అదే ట్రాక్టర్ కిందపడి మృతి చెందాడు. చందోలు ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్ కథనం ప్రకారం, బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం భవనారిపాలెంకి చెందిన కొండవీటి వెంకటప్రసాద్ (34) ఆదివారం తన కుమారుడి అన్నప్రాసన కార్యక్రమం పనుల నిమిత్తం చందోలు బగళాముఖి దేవస్థానం నుంచి ద్విచక్రవాహనంపై రెడ్డిపాలెం సెంటర్ నుంచి భవనవారిపాలెంకి వెళుతున్నాడు. ఈ క్రమంలో తన ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి అదే ట్రాక్టర్ కిందపడి మృతి చెందాడు. ఈ విషయమై మృతుని భార్య హారిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. '108' వాహనంలో మృతదేహాన్ని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడు వెంకటప్రసాద్ వైజాగ్‌లోని ఓ ఫార్మాకంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడని కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 560.50 అడుగులు ఉంది. ఇది 233.59 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9900 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6478 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 19,058 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

సరికొండపాలెం వీఆర్‌వో సస్పెన్షన్

బొల్లాపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని సరికొండపాలెంకి చెందిన వీఆర్‌వో రవి నాయక్‌పై సస్పెన్షన్ వేటు పడినట్టు తెలియవచ్చింది. అసైన్డ్ భూము లను తమ కుటుంబసభ్యుల పేరుతో ఆన్‌లైన్ చేయించు కున్నా రని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేసినట్టు తెలి సింది. ఢిల్లీకి చెందిన శతన్‌సిన్హా యాదవ్‌కు చెందిన భూములను కుటుంబసభ్యుల పేరుతో రాయించారని ఆ ఫిర్యాదులో ఆరోపించారు.

11 ఎకరాల గడ్డివామి దగ్ధం


ముత్తాయపాలెంలో అగ్నికి ఆహుతవుతున్న గడ్డివామిలను ఆర్పుతున్న స్థానికులు

బాపట్లరూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం ముత్తాయపాలెంలో ప్రమాదవశాత్తు సంభవించిన అగ్నిప్రమాదంలో 11 ఎకరాల గడ్డివాము అగ్నికి ఆహుతైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ముత్తాయపాలెంకి చెందిన దబ్బకూటి శ్రీనివాసరావుకి సంబంధించిన 11 ఎకరాల వరి గడ్డివామి గ్రామశివారులో వేసుకున్నాడు. అయితే, దీనికి సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు ఉన్నాయి. షార్ట్‌సర్క్యూట్ కావడంతో గడ్డివాముకు నిప్పు అంటుకోవడంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. గ్రామం మొత్తం పొగ కమ్మివేయటంతో గ్రామస్తులు, బాధిత రైతు స్థానికుల సాయంతో మంటలను ఆర్పేందుకు విఫలయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వ డంతో రెండు ఫైరింజన్‌లతో వారు మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఈ ఘటనలో సుమారు లక్ష రూపాయలకు పైగా రైతుకు నష్టం వాటిల్లినట్లు సమాచారం.

రెండేళ్ల చిన్నారితో
గుర్తుతెలియని మహిళ ఆత్మహత్య



గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : బుడంపాడు జాతీయ రహదారి సమీపంలోని రైల్వే ట్రాక్‌పై రైలు కింద పడి రెండేళ్ళ చిన్నారితో సహా గుర్తుతెలి యని మహిళ ఆత్మహత్య చేసు కుంది. ఈ నెల 18న అర్ధరాత్రి సమ యంలో సుమారు 30 సంవత్సరాల వయసు కలిగిన ఓ గుర్తుతెలియని మహిళ, సుమారు రెండేళ్ల వయసు కలిగిన పాపతో విజయవాడ నుంచి చెన్నై వెళ్లే నేషనల్ హైవే సమీపంలో బుడంపాడు బ్రిడ్జి కింద రైల్వే ట్రాక్‌పై ఈ ఘటన జరిగింది. గుంటూరు రైల్వే పోలీసుల కథనం మేరకు, చనిపోయిన మహిళ లైట్ గ్రీన్ కలర్ టాప్, వంకాయ రంగు ప్యాంటు గల పంజాబీ డ్రెస్ ధరించి ఉంది. పాప సిమెంటు రంగు టీ షర్టు ధరించి ఉంది. సమీపంలో పడి ఉన్న చిన్న బ్యాగ్‌లో దుప్పటి ఉంది. తల్లీకూతుళ్ల మృతదేహాలను మార్చురీలో భద్రపరిచినట్లు సీఐ లక్ష్మీనారాయణరెడి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తనను 8328018787 నంబరులో గాని, జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌కు 0863-222073 నంబరులో గానీ తెలియ జేయాలని తెలిపారు.

కృష్ణా నదిలో మునిగి వ్యక్తి మృతి

అచ్చంపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుట్లగూడెంకి చెందిన మర్రి రాములు(32) ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు కృష్ణా నదిలో మునిగి మృతి చెందారు. రాములుతో పాటు మరో ముగ్గురు వ్యక్తులు అయ్యప్ప మాలలను ధరించారు. ఈ నేపథ్యంలో స్నానానికి అని కృష్ణా నదిలో దిగారు. రాములు ఈత కొట్టుకుంటూ లోతుకు వెళ్ళి తిరిగి వచ్చే క్రమంలో ఈద లేక మునిగిపోయాడు. ముగ్గురు వ్యక్తులు నది ఒడ్డునే స్నానం చేశారు. మునిగిపోయిన రాములు కోసం స్థానికులు గాలింపు చర్యలు చేపట్టగా, రాత్రి కృష్ణా నది నుంచి మృతదేహాన్ని వెలికి తీశారు. ఘటనా స్థలాన్ని సీఐ వెంకట ప్రసాదుతో పాటు పోలీసులు సందర్శించారు. రాములుకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి


చాట్ల బాలు

తాడేపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లిలోని ఎత్తిపోతల పథకం వద్ద కృష్ణానదిలో ఆదివారం సాయంత్రం ఈతకు దిగిన ఓ యువకుడు ప్రమాదవ శాత్తూ గల్లంతై మృతిచెందాడు. యువ కుడు విజయవాడకు చెందిన చాట్ల బాలు (18)గా పోలీసులు గుర్తిం చారు. తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు సంఘటనా స్థలాన్ని పరి శీలించారు. చీకటి పడ డంతో మృతదేహం గాలింపు చర్యలు సోమ వారం చేపడతామని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

తెనాలి అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ మోర్ల శ్రీనివాసరావు (45) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. పట్టణంలోని నాజరుపేటలో ఉంటున్న ఆయన తెల్లవారుజామున గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తీసుకు వెళ్లేలోగా మృతి చెందారు. 1995లో పోలీసు శాఖలో ప్రవేశించిన ఆయన కొంతకాలంగా గుంటూరు ఏఆర్ పోలీసుల ఎస్కార్ట్ డ్యూటీలో ఉంటున్నారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. సీఐ రాంనాయక్, ఎస్ఐ బాబురావు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

తుమ్మకోట సమీపంలోని అడవిలో
ఆవుల మందపై పెద్దపులి దాడి

రెంటచింతల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మకోట గ్రామ సమీపంలోని అడవిలో పెద్దపులి సంచరిస్తుండడంతో పశువుల కాపరులు భీతావహులయ్యారు. ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో ఆవులను తీసుకుని అడవిలోకి వెళ్తున్న సమయంలో కందినాగమ్మకుంట పైభాగంలో నెమలిశెల వద్ద పెద్ద పులి ఆవుల మందపై దాడి చేసింది. గోవులు పులి బారినుంచి తప్పించుకోగా, ఆవుదూడ మాత్రం పులి నోట చిక్కింది. పులి దాడితో పశువుల కాపరి బాలునాయక్ గ్రామంలోకి వెళ్లి ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలిపారు. మండలంలో పెద్దపులి సంచరించడం.. దాడి చేయడం ఇదే మొదటిసారి. పులి సంచారం విషయాన్ని తుమ్మకోట వీఆర్వో నరసింహారావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ విజయనిర్మల, సెక్షన్ ఆఫీసర్ వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లారు. చీకటి పడడంతో సోమవారం పులి సంచరించిన ప్రదేశాన్ని పరిశీలించడంతోపాటు పాదముద్రలు సేకరించి, ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తామని బీట్ ఆఫీసర్ చెప్పారు.


మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసిన రైల్వేలైన్ బాధిత రైతులు

రైల్వే ప్రాజెక్టు కోసం భూముల సమీకరణకు రైతుల వినతి

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి) నూతనంగా రాజధాని అమరావతికి కేంద్రప్రభుత్వం నిర్మించనున్న రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం నిర్ధారించిన భూములను భూ సమీకరణ ద్వారా తీసుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు పలు గ్రామాల రైతులు విన్నవించుకున్నారు. తెలంగాణాలోని ఖమ్మం సమీపంలో ఉన్న ఎర్రుపాలెం నుంచి రాజధాని అమరావతి మీదుగా నంబూరు వరకు సుమారు 57 కిలోమీటర్ల మేరకు నిర్మించే రైల్వేలైనుకు భూమిని సేకరించాల్సి ఉంది. కృష్ణా నదికి దక్షిణ వైపున ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వైకుంఠపురం నుంచి నంబూరు వరకు అమరావతి, తాడికొండ మండలాలలోని పలు గ్రామాల మీదుగా ఇందుకు సంబంధించి 527 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. సీడ్ క్యాపిటల్ పరిధిలోని తాడికొండ మండలంలో కొప్పురావూరు, పెదకాకాని, తాడికొండ, మొతడక, కంతేరు, పెదపరిమి, వడ్లమాను గ్రామాల రెవెన్యూ పరిధిలో 199 ఎకరాలు, పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి గ్రామాల రెవెన్యూ పరిధిలో 330 ఎకరాలు ఈ రైల్వే లైనుకు అవసరమని గుర్తించి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి సంబంధిత రైతుల అభిప్రాయాలను కోరింది. సీడ్‌క్యాపిటల్ పరిధిలోని ఆయా గ్రామాల రైతులు తమ భూమిని భూ సేకరణ ద్వారా కాకుండా సమీకరణ ద్వారా తీసుకోవాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కొందరు రైతులు కలిశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, సానుకూలంగా స్పందించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. భూసమీకరణపై పూర్తి అవగాహన కలిగిన కొందరు రైతులు మళ్లీ వచ్చి కలిస్తే పరిశీలించి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానని రైతులకు ఆయన హామీ ఇచ్చారు.



లీగ్ పోటీలో గెలుపొందిన జట్టు సభ్యులు

జోరుగా హుషారుగా.. ప్రీమియర్ లీగ్ పోటీలు

మంగళగిరి సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజును పురస్కరించుకుని మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయక్రికెట్ మైదానంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు జోరుగా హుషారుగా సాగుతున్నాయి. పోటీలను తిలకించేందుకు యువత, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో వస్తుండడంతో స్టేడియంలో సందడి వాతావరణం నెలకొంది. 8వ రోజైన ఆదివారం తూర్పు గోదావరి జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కడప తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తూర్పు గోదావరి 14.4 ఓవర్లలో 75 పరుగులు చేసి ఆలౌట్ అయింది. కడప 31 పరుగుల తేడాతో విజయం సాధించింది. 4 ఓవర్లలో 18 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టిన షేక్ ఆరిఫ్ బాషా 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. కృష్ణా జిల్లా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 16.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి 4 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. 21 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టిన ఎం.శ్రీను 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును సొంతం చేసుకున్నారు. తెలుగు యువత మంగళగిరి పట్టణ అధ్యక్షుడు బోగి వినోద్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కనికళ్ల చిరంజీవి సహకారంతో రూ.పది వేల చొప్పున మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను అందజేశారు. ఈ పోటీలకు సేల్, సక్కు, మార్కోరేస్, ఉషోదయ సంస్థలు స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నాయి.


ప్రసంగిస్తున్న జలవనరుల ప్రాజెక్టుల అధ్యయనకారుడు లక్ష్మీనారాయణ, పక్కన లక్ష్మణరెడ్డి

నిర్మాణంలోని ప్రాజెక్టులను పూర్తి చేయాలి

● జలవనరుల ప్రాజెక్టుల అధ్యయనకారుడు లక్ష్మీనారాయణ

గుంటూరు కార్పొరేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భారీ, మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులన్నిం టినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జలవనరుల ప్రాజెక్టుల అధ్యయనకారుడు, ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక కన్వీనర్ టి.లక్ష్మీనారాయణ తెలిపారు. చైతన్య వేదిక ఆధ్వర్యంలో గుంటూరులో 'ఆంధ్రప్రదేశ్‌లో నీటిపారుదల ప్రాజెక్టులు - ప్రస్తుత పరిస్థితి' అనే అంశంపై ఆదివారం జరిగిన చర్చా గోష్ఠిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాయలసీమలోని హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగుగంగ, ప్రకాశం జిల్లాలోని వెలుగొండ, ఉత్తరాంధ్రలోని వంశధార రెండో దశ, తోటపల్లి బ్యారేజి, వంశధార నాగవల్లి అనుసంధాన పథకం, ఉత్తరాంధ్ర సృజల స్రవంతి ప్రాజెక్టులకు అవసరమైన నిధులను కేటాయించాలన్నారు. గోదావరి బనకచర్ల అనుసంధాన పథకంపై విస్తృత చర్చ నిర్వహించాలని సూచించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు భారంగా మారకూడదన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ రూ.90 వేల కోట్లతో గోదావరి బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టాలనుకోవడం సబబు కాదన్నారు. దీనికి బదులు రూ.20 వేల కోట్లతో ఉత్తరాంధ్ర, రాయలసీమలో కొనసాగుతున్న ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిసర్ల కృష్ణమూర్తినాయుడు ప్రసంగిస్తూ కేవలం రూ.3,000 కోట్లు ఖర్చు చేస్తే ఉత్తరాంధ్రలో నీటిపారుదల ప్రాజెక్టులన్నీ పూర్తవుతాయన్నారు. ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు వై.కేశవరావు ప్రసంగిస్తూ గత ఐదేళ్లలో నీటిపారుదల ప్రాజెక్టుల కేటాయింపులలో 52 శాతం మాత్రమే ఖర్చు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం బడ్జెట్లో రూ. 15 వేల కోట్ల కేటాయిం చినా కోటి కూడా విడుదల చేయలేదని అన్నారు. అనంతరం ప్రొఫెసర్ డీఏ ఆర్ సుబ్రహ్మణ్యం, ఉమ్మడి గుం టూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాస రావు, హైకోర్టు అడ్వకేట్ ఎస్.శ్రీనివాసరావు, ఆంధ్ర ప్రదేశ్ గెజి టెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు ఏపీ పటేల్, నేస్తం సహ వ్యవ స్థాపకుడు టి. ధనుంజయ రెడ్డి, వంశధార సాధన సమితి ప్రెసిడెంట్ ఎస్వీవీ (ప్రసాద రావు) ప్రసంగించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	142,151,162
చికెన్ విత్ స్కిన్	274.00
చికెన్ స్కిన్ లెస్	284.00

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 37.53 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని రాజు తెలిపారు.

జోన్ డైరీ

● మండలకేంద్రమైన దుర్గిలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నుంచి ఒంగోలుజాతి పశు బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు దుర్గి వ్యవసాయశాఖ సొసైటీ అధ్యక్షుడు కటకం రామారావు, గండె గోపాలరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

● పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో గల స్వామి వివేకానంద సేవాశ్రమంలో 26వ తేదీ నుంచి ఉచిత యోగ, మెడిటేషన్ క్లాసులు ప్రారంభమవుతాయని శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 9440006813, 9346162835లను సంప్రదించాలని కోరారు.

● పెదకూరపాడు ప్రభుత్వ పాఠశాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ ప్లాంట్‌ను సోమవారం ప్రారంభించనున్నట్లు హెచ్‌ఎం అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 75 తాళ్ళూరు జడ్పీ హైస్కూలు పూర్వ విద్యార్థి ఉమా సుందరి జ్ఞాపకార్థం, ఆమె భర్త సింహాద్రి లీలా ప్రసాదురెడ్డి, కుమారులు సుమారు రూ.5 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు జాబ్ మేళా

క్రోసూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ ఆధ్వర్యంలో సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా మేనేజర్ తమ్మాజీ రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల, 10వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, బీటెక్, ఫార్మసీ, పీజీలతో పాటు డిప్లమో విద్యార్హతగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగలవారు బయోడేటా, రెజ్యూమ్, అర్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు.

దుప్పట్లు పంపిణీ

మాచర్లటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అబ్దుల్ కలాం సేవా సమితి కార్యాలయంలో ఆదివారం పట్టణానికి చెందిన రంగమ్మ చిల్డ్రన్స్ హాస్పిటల్ డాక్టర్ దశరథ్, బాలాజీ డెంటల్ హాస్పిటల్ డాక్టర్ సైదులు నాయక్‌లు 10మంది దివ్యాంగులకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి వ్యవస్థాపకుడు ఎస్‌కె పాషావలి, దివ్యాంగుల సంఘ నేతలు అంజిబాబు, శంకర్, మను, మక్కెన కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆర్థికసాయం

మాచర్లటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 18వ వార్డుకు చెందిన అంగన్‌వాడీ వర్కర్ కుమారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యాన కుమారి కుటుంబ సభ్యులకు రూ. 30 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు బండ్ల మహేష్, వేముల వెంకటరావు, అంగన్‌వాడీ నేతలు ఉష, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి నగదు సాయం

దాచేపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి మాలధరించి ఇరుముడి కట్టుకొని శబరిమల వెళ్తుండగా జరిగిన కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాలు పోగొట్టుకున్న శ్రీరామ దాసు కార్తిక్‌కు దాచేపల్లి వారధి ఫౌండేషన్‌వారు రూ.31,200 ఆదివారం ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు తగరం ఆనంద్‌కుమార్, షేక్ కిషోర్, టి ఉపేంద్ర, శ్రీధర్, ఇతర గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

గోశాల అభివృద్ధికి రూ. 1,00,116 విరాళం

దుర్గి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పులలో ఉన్న నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి ఆలయంలో గోశాల అభివృద్ధికి అచ్చంపేట మండలం, ఓర్వకల్లుకు చెందిన అరవపల్లి నవోదయం అనే మహిళ రూ. 1,00,116 విరాళంగా అందించినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కమిషనర్, ఈవో సైదమ్మ బాయిలు ఆదివారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఐఎఫ్‌వోఎస్ డిప్యూటీ డైరెక్టర్, జీవోఐ మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్సు అధికారి జీ. మధుబాబు కుటుంబసమేతంగా ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు వేద మంత్రోచ్చరణతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందించారు.


కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకుంటున్న మధుబాబు

కూటమి పాలనలో రాష్ట్రం పురోగమిస్తోంది

● గురజాలను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతా
● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రాష్ట్రం అన్నివిధాలా పురోభివృద్ధిని సాధిస్తోందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కి వెళ్లిందన్నారు. గతంలో టీడీపీ కేంద్ర ప్రభుత్వం సాయంతో టిడ్కోగృహాలను 70 శాతానికి పైగా పూర్తి చేయగా మిగిలిన పనిని వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయకుండానే రుణాలుపొంది లబ్ధిదారులను నిరాశ పర్చిందన్నారు. పిడుగురాళ్లలో మున్సిపల్ భవనానికి రూ.2 కోట్లు టీడీపీ హయాంలోనే మంజూరు కాగా,ఆ భవన నిర్మాణాన్ని అసంపూర్తిగానే వదిలేసిందన్నారు. త్వరలో మున్సిపల్ భవనాన్ని తామే పూర్తి చేస్తామన్నారు. చెరువు ప్రాంతంలో 10 ఎకరాల విస్తీర్ణంలో ఆహ్లాదకరమైన పార్కును ఏర్పాటు చేసేందుకు మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ నిధులు మంజూరు చేశారన్నారు. పిడుగురాళ్ల బైపాస్‌ను పూర్తిచేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి తాను ఎంతో కృషి చేయగా, గడిచిన ఐదేళ్లకాలంలో వైసీపీ నేతలు పట్టించుకున్న పాపానపోలేదన్నారు. ప్రస్తుతం తాము దైద, మోర్జంపాడు, భట్రుపాలెం, గుత్తికొండ బిళంను పర్యాటక


మాడుగులకు చెందిన మాగంటి సుబ్బయ్యకు సీఎంఆర్‌ఎఫ్ చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

కేంద్రాలుగా తీర్చి దిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పింఛన్ల విషయంలో తాము రాజకీయం చేయబోమని, అర్హులందరికీ పింఛన్‌లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో టీడీపీ నేతలు పాండురంగ శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, సాంబశివరావు, కనిగిరి శ్రీను, మల్లెల ఆదినారాయణ, తురకా వీరస్వామి, పిల్లి చెన్నారావు, ఎల్‌పీఆర్, బొల్లా శ్రీను, జొన్నలగడ్డ శ్రీను, కామిశెట్టి రమేష్, మేకల రాంబాబు, యడ్లపల్లి నారాయణ, శివ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

గురజాల నియోజకవర్గంలో సీఎం సహాయనిధి లబ్ధిదారులైన 23 మందికి రూ. 41,03,52 చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే యరపతినేని అందజేశారు. దాసరి కోటయ్యకు రూ.10 లక్షలు (దాచేపల్లి), మాగంటి సుబ్బయ్యకు రూ. 3,01,377 (మాడుగుల) చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

బోట్ రేసింగ్ టీంకు యరపతినేని అభినందనలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి డ్రాగన్ బోట్ రేసింగ్‌లో దాచేపల్లి మండలం పొందుగల గ్రామానికి చెందిన పల్నాడు తండర్స్ టీమ్ సభ్యులు ప్రథమస్థానంలో నిలిచారు. టీం సభ్యులను ఆదివారం పిడుగురాళ్లలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వేముల వినోద్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బెల్లంకొండ భద్రి, మాజీ సర్పంచ్ తంగెళ్ల శ్రీనివాస రావు పాల్గొన్నారు.


మాడుగులకు చెందిన మాగంటి సుబ్బయ్యకు సీఎంఆర్‌ఎఫ్ చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

సచివాలయ విధుల ప్రక్షాళన..

● కార్యదర్శుల పని విభజన దిశగా అడుగులు
● జనాభా ప్రాతిపదికన సిబ్బంది నియామకం
● కూటమి ప్రభుత్వం కసరత్తు

సత్తెనపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా ఉద్యోగుల సేవలకు అనుగుణంగా పనిని విభజించేలా సచివాలయ పాలనాధికారులు కసరత్తు చేస్తున్నారు. సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, సంక్షేమ కార్యదర్శులు, మహిళా పోలీసులు వారి శాఖలకు సంబంధించిన పనులు మాత్రమే చేస్తున్నారు. వీరు ఇకపై బహుళార్థక సేవలు అందించేలా వినియోగించు కోనున్నారు. సంక్షేమ పథకాల అమలు, సర్వేలు, పంపిణీలు తదితర బాధ్యతలను అప్పగించనున్నారు. మిగిలిన వారు తమ శాఖల సేవలనే కొనసాగించే అవకాశం ఉంది. ఆరోగ్యం, ఉద్యాన, వ్యవసాయ, పశు సంవర్థక, ఇంజనీరింగ్, విద్యుత్ సహాయకులు సాంకేతిక సేవా కార్యదర్శులుగా మారనున్నారు.



ప్రస్తుతం గ్రామీణ ప్రాంత సచివాలయాల్లో 10 మంది కార్యదర్శులు పని చేస్తున్నారు. పట్టణాల్లోని వార్డు సచివాలయాల్లో 8 మంది ఉన్నారు. దీంతో ఎక్కువ జనాభా ఉన్న పట్టణాల కంటే తక్కువ ఉన్న గ్రామాల్లోనే సిబ్బంది అధికంగా ఉన్నారు. ప్రభుత్వం తీసుకు వచ్చిన కొత్తవిధానంతో 2500 మంది జనాభా లేదా 5 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలను యూనిట్‌గా తీసుకొని ఉద్యోగులను విభజించనున్నారు.


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ జగదీష్

1500 మందికి వైద్యపరీక్షలు

గురజాలటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ హైస్కూలు ఆవరణలో ఆదివారం గుంటూరు చెందిన కిమ్స్‌శిఖర హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా సూపర్ స్పెషాలిటీ వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ చిట్టెం లక్ష్మణ్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ వైద్యశిబిరాన్ని డీఎస్పీ జగదీష్ ప్రారంభించారు. వైద్యులు 1500 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు జయకిషన్, రాజశేఖర్, విష్ణుప్రసాద్, శివప్రసాద్, సాయికృష్ణారెడ్డి, శరత్‌చంద్ర, శ్రీకాంత్, శ్రీదేవి, స్రవంతి, సాహితి, అనిత, మున్సిపల్ కమిషనర్ శివన్నారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, అడపా శ్రీనివాసరావు, బొల్లయ్య, జాస్తి ప్రసాద్, జనసేన నేతలు బిడెల శ్రీనివాసరావు, కటికం అంకారావు, సిబ్బంది పాల్గొన్నారు.


లక్ష్మీ కుబేర వ్రతంలో మహిళలు

వైభవంగా లక్ష్మీ కుబేర వ్రతం

కారంపూడి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరాంజనేయ షిర్డీసాయి ఆలయంలో ఆదివారం అర్చకుడు దిలీప్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యాన లక్ష్మీ కుబేర వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. 108 మంది మహిళలు ఈ వ్రతంలో పాల్గొన్నారు. గణపతి, నవగ్రహ, కలశ, లక్ష్మీ కుబేర యంత్రాలకు అభిషేకాలు జరిపారు. వ్యాఖ్యాతగా సింగరుట్ల దేవస్థాన అర్చకుడు మారేపల్లి వెంకటరమణాచార్యులు వ్యవహరించారు. కార్యక్రమంలో రంగనాథచార్యులు, గుండా నాగ మల్లీశ్వరి, గోపి, రామారావు, శ్రీను, ప్రసాద్, ధర్మకర్త యేచూరి శంకరరావు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగిచోరీ

రెంటచింతల,జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గురజాల వెళ్లే ఆర్ అండ్ బీ రహదారి పక్కన పొలాలకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగలు చోరీకి గురైనట్లు బాధిత రైతు టి.రాయపరెడ్డి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనతో తనకు సుమారు రూ.30 వేలు నష్టం ఏర్పడిందని బాధితుడు ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. విద్యుత్ అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఇటీవలి కాలంలో కాపర్ వైర్ల చోరీకి అడ్డు అదుపు లేకుండా పోయిందని, రైతులు, స్థానికులు చర్చించుకుంటున్నారు.


కబడ్డీ సీనియర్ జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు

జిల్లా కబడ్డీ సీనియర్ జట్టు ఎంపిక

పిడుగురాళ్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరుజిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మాంటిస్సోరి ఇంగ్లీషుమీడియం స్కూల్ ఆవరణలో జిల్లా సీనియర్ కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డీ.నాగాంజనేయులురెడ్డి ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారుల నుంచి జిల్లా జట్టును ఎంపిక చేశారు. జిల్లా జట్టుకి ఎంపికైనవారు ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు విశాఖపట్టణం సమీపంలో జరిగే 71వ అంతర్‌జిల్లాల కబడ్డీపోటీలకు ఉమ్మడి గుంటూరుజిల్లా నుంచి హాజరవుతారని నాగాంజనేయరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నల్లబాటి ధనుంజేయులు, ఆవుల జనార్ధన్, మదీనా మస్తాన్, షేక్ మీరావలి, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి డీ. నల్లిరెడ్డి, అధ్యక్షుడు కందుల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు అక్కల శ్రీనివాసరెడ్డి, ఎం నాగేంద్రబాబు పాల్గొన్నారు.

వేమన విగ్రహానికి నివాళి

పెదకూరపాడు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు మండలంలోని 75 తాళ్ళూరులో ఆదివారం యోగి వేమన జయంతి సందర్భంగా వేమన విగ్రహానికి స్థానికులు నివాళులర్పించారు. కార్యక్రమంలో కొల్లి బ్రహ్మారెడ్డి, వెంకటరెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణరెడ్డి, మాధవరెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

కానుకమాత తిరునాళ్ల
పోస్టర్లు ఆవిష్కరణ

రెంటచింతల,జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే అత్యంత పురాతనమైన చర్చిలలో ఒకటైన రెంటచింతల కానుకమాత చర్చి 175వ తిరునాళ్ల మహోత్సవ కరపత్రాలను ఆర్‌సీఎం చర్చి విచారణా గురువులు వైఎల్ మర్రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ చర్చిని 1850లో నిర్మించారు. ఈనెల 24న జెండా ప్రతిష్ఠతో ఉత్సవాలు ఆరంభమవుతాయని మర్రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 2న జరగబోయే తిరునాళ్ల మహోత్సవానికి గుంటూరు బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య, కడప అపోస్తలిక పాలనాధికారి గాలి బాలి, నల్గొండ విశ్రాంత పీఠాధిపతులు గోవిందు జోజి ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో సహాయ విచారణాధికారి అగస్టీన్, కథోలికా సంఘస్థులు పాల్గొన్నారు.


కంటి వైద్యశిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ నాగమణి

నేత్రాలను సంరక్షించుకోవాలి

సత్తెనపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : నేత్రాల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా సంరక్షించుకోవాలని అబుల్ కలాం థెరిస్సా సేవా సొసైటీ నిర్వాహకులు డాక్టర్ చందోలు నాగమణి అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్ కంటి పరీక్ష ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్లు, సిబ్బంది పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు, సలహాలను అందించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కంభంపాటి అబ్రహం, పాస్టర్ సత్యానందం, టీడీపీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారు నాగరాజు, ఎంఈఎఫ్ నేతలు గరికపాటి హిట్లర్, అడపాల ప్రేమ్ కుమార్, సాయి, కిరణ్ పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

నకరికల్లు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు కుంకలగుంటలో ఆదివారం బహుమతులను అందజేశారు. రెడ్డిపాలెం, జడ్పీ హై స్కూల్ కుంకలగుంట, లింగంగుంట్ల టీంలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నాయి. సాగు నీటిసంఘం మాజీ అధ్యక్షుడు ఆవుల సుబ్బయ్య, నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మర్రివేముల శ్రీనివాసరావు, అవుదూరి శ్రీనివాసరెడ్డి, తుమ్మలచెరువు నాగరాజు, పసుపులేటి మల్లేశ్వరిలు విజేత జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆవుల సుబ్బారావు, కోళ్ళపూడి మాణిక్యారావు, గోపు శ్రీనివాసరావు, తాండ్ర శ్రీను, వెంకటరావులు పాల్గొన్నారు.


మురికిగా ఉన్న నీటి ట్యాంకు

తాగునీరు అధ్వానం

● విన్నవించినా పట్టించుకోని అధికారులు
● ఆందోళనలో గ్రామస్థులు

దుర్గి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దుర్గిలోని ముస్లిం బజారులో గల నీటి ట్యాంకు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ట్యాంకు బాగా పాచి పట్టి మురికిగా ఉంది. పంచాయతీ బోరు ద్వారా ఈ ట్యాంకులో నీటిని నింపుతున్నారు. ట్యాంకు శుభ్రం చేయకపోవడంతో నీరు దుర్వాసన వస్తోంది. ఆ నీరు వినియోగించిన ప్రజలు చర్మవ్యాధులు భారిన పడుతున్నారు. ఈ విషయంపై అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

మిర్చి పంట ధ్వంసం

● గుర్తు తెలియని వ్యక్తుల దుశ్చర్య
● పరిశీలించిన జనసేన నేత రామాంజనేయులు

మాచర్ల రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మిర్చి పంటను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన మండలంలోని జమ్మలమడకలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు గొబ్బూరి గోపి మూడెకరాల్లో మిర్చి సాగు చేశాడు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మిర్చి మొక్కలను పీకి ధ్వంసం చేశారు. ఆదివారం పొలానికి చేరుకున్న గోపి పైరు ధ్వంసమైనట్లు గుర్తించారు. సుమారు రూ. 2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. విషయం తెలుసుకున్న జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజినేయులు గ్రామానికి చేరుకొని మిర్చి పొలాన్ని పరిశీలించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆయన వెంట జనసేన నేతలు అంకారావు, హరీష్, శ్రీరామ్మూర్తి, నరసింహారావు ఉన్నారు. ఈ ఘటనపై బాధితుడు గొబ్బూరి గోపి మాచర్ల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.


ధ్వంసమైన మిర్చిపైరుని పరిశీలిస్తున్న రామాంజినేయులు

పశుపోషకుల ఆర్థికాభ్యున్నతికి కృషి

● డాక్టర్ ఎం శ్రీనివాసరావు
సత్తెనపల్లి ఏరియా
పశు సంవర్ధక శాఖ అధికారి

ఫటా ఫట్



సత్తెనపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పశుపోషకుల ఆర్థికాభ్యున్నతికి తోడ్పాటునందించటం తోపాటు పశు సంవర్ధకరంగాన్ని మరింత పరిపుష్టం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సత్తెనపల్లి ఏరియా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం శ్రీనివాసరావు తెలిపారు. పశువుల ఆరోగ్యానికి, ఉత్పాదకతను పెంచటానికి, వ్యాధులను నియంత్రించటానికి, పశుపోషణ ఖర్చులు తగ్గించటానికి ప్రభుత్వం వివిధ కార్యక్రమలను నిర్వహిస్తుందని అన్నారు. ఆయనతో ఆంధ్రజ్యోతి ప్రతినిధి 'ఫటాఫట్' ఇంటర్వ్యూ..

ప్రశ్న : పశు పోషకుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఏవి?

డాక్టర్ : పశు పోషకులకు తోడ్పాటును అందించటానికి గోకులం, బహువార్షిక పశుగ్రాస క్షేత్రాలు, పశు బీమా, రాయితీపై ఇన్‌ఫుట్ సబ్సిడీ సరఫరా, పశు కిసాన్ క్రెడిట్ కార్డులు, సంచార పశు ఆరోగ్య సేవలు వంటి పలు పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుంది.

ప్రశ్న : నట్టల నివారణకు ఏయే మందులు వాడాలి?

డాక్టర్ : పశువులకు, దూడలకు, సన్న జీవాలకు పశువుల ఆస్పత్రుల్లో నట్టల నివారణ మందు ఉచితంగా అందజేస్తారు. నట్టల నివారణమందును క్రమం తప్పకుండా జీవాలు, దూడలకు తాగించటం వలన బరువు పెరిగి ఆరోగ్యంగా ఉంటాయి. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

ప్రశ్న : పశు పోషకులకు ఇన్‌ఫుట్ సరఫరా ఎలా అందిస్తారు ?

డాక్టర్ : పశువుల దాణాపై ప్రభుత్వం నాణ్యమైన ఇన్‌ఫుట్ సబ్సిడీని అందిస్తుంది. సంపూర్ణ మిశ్రమ దాణాను పశు పోషకులకు 60 శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తుంది. అలాగే పశుగ్రాస విత్తనాలు 75 శాతం రాయితీ పై అందిస్తోంది.

ప్రశ్న : పశు కిసాన్ క్రెడిట్ కార్డుకు అర్హతలు ఏమిటి?

డాక్టర్ : పశు పోషకులు, జాయింట్ లాయబుల్టీ గ్రూపులు, స్వయం సహాయక సంఘాలు, సంత, లీజుకు అద్దెకు తీసుకున్న షెడ్డు కలిగిన పశు పోషకులు అర్హులు. ఓటరు గుర్తింపు కార్డు, రెండు పాసు ఫోర్టు సైజు ఫోటోలు, అప్లికేషన్ ఫారం పూర్తి చేసి దగ్గరలోని బ్యాంకులో సమర్పిస్తే కిసాన్ క్రెడిట్ కార్డు వస్తుంది.

ప్రశ్న : పశు బీమా వలన ఉపయోగాలు ఏంటి?

డాక్టర్ : ఉత్పాదక దశలో ఏదైనా పశువు ప్రమాదవశాత్తు మరణించినట్లయితే, ఆయా పశువులకు బీమా చేయించినట్లయితే పశుపోషకులు ఆర్థికంగా నష్టపోకుండా ఉంటారు. ఒక కుటుంబానికి ఒక సంవత్సరానికి ఐదు పశువులు, 50 జీవాలకు బీమా సౌకర్యం ఉంటుంది.

నేటి నుంచి పశు ఆరోగ్యశిబిరాలు

సత్తెనపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సత్తెనపల్లి నియోజకవర్గంలో ఉచిత పశు ఆరోగ్యశిబిరాలు నిర్వహించనున్నట్లు సత్తెనపల్లి ఏరియా పశు సంవర్ధక శాఖ అధికారి ఎం శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరాల్లో పశువులను పశు వైద్యులు పరీక్షించి ఉచితంగా వైద్యం చేస్తారని, తేలికపాటి శస్త్ర చికిత్సలు చేసి అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. నియోజక వర్గంలోని పశు పోషకులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని ఆయన కోరారు.

ముప్పాళ్ళ(ఆంధ్రజ్యోతి) : ముప్పాళ్ళ మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం నుంచి 31వ తేదీ వరకు పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు ముప్పాళ్ళ మండల పశు వైద్యాధికారి ఎం పుల్లారెడ్డి తెలిపారు. గేదెలు, దూడలు, జీవాలకు గర్భకోశ వ్యాధులు, నట్టల నివారణకు సంబంధించి పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తామన్నారు. జీవాలకు బొబ్బ టీకాలు అందిస్తామన్నారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

క్రోసూరు, (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు మండలంలో సోమవారం నుంచి 31వ తేది వరకు పశు ఆరోగ్యశిబిరాలు నిర్వహించనున్నట్టు మండల పశు వైద్యాధికారి సీహెచ్ మల్లయ్య ఆదివారం తెలియ జేశారు. 20వ తేదీన ఆవులవారిపాలెం, బయ్యవరంగ్రామాల్లోను, 21న దొడ్లేరు, క్రోసూరు, 22న అందుకూరు, బాలెమర్రు, 23న విప్పర్ల, ఊటుకూరు, 27న అనంతవరం, హసానాబాద్, 28న ఎర్రబాలెం, పెరికపాడు, 29న నాగవరం, పీసపాడు, 30న 88 తాళ్ళూరు, ఉయ్యందన, 31న గరికపాడు, గుడిపాడుగ్రామాల్లో ఆరోగ్యశిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

దాచేపల్లి, (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి 31వ తేదీ వరకు పశుఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారులు తెలిపారు. ఈ శిబిరాలలో దూడలు, పశువులు, గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందులు అందజేస్తారని తెలిపారు. పశువులకు గర్భకోశ వ్యాధులు చికిత్స నిర్వహిస్తున్నట్లు వివరించారు.


మహ్మద్ ఆలీ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్

మృతుల కుంటుంబాలకు పరామర్శ

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రమైన అమరావతిలో సీనియర్ టీడీపీ నేత షేక్ మహ్మద్ ఆలీ(మోడరన్) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న పల్నాడుజిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మహ్మద్‌ఆలీ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తంచేశారు. అనంతరం మాజీ ఎంపీపీ పేరుబోయిన ఆదిలక్ష్మి ఇటీవల మరణించగా ఆమె భర్త సాంబశివరావును, కుటుంబ సభ్యులను కొమ్మాలపాటి కలసి సానుభూతి తెలియజేశారు. శ్రీధర్ వెంట స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రాణ సంకటం

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడు నుంచి పాటిబండ్ల రోడ్డులో తారు రోడ్డు వేసేందుకు కంకర పగల గొట్టారు. కానీ ఇంతవరకు తారు రోడ్డు వేయలేదు. దీంతో ఆ మార్గంలో వాహనదారుల ప్రయాణం వారికి ప్రాణసంకటంగా మారింది.





పెదకూరపాడు మండలంలోని బుచ్చయ్యపాలెం మీదుగా హుస్సేన్ నగరం వెళ్ళే ఆర్‌అండ్‌బీ రహదారిలో తూముల వద్ద రోడ్డు మార్జిన్ కోతకు గురైంది. ఆ రహదారిలో ఆర్టీసీ బస్సులతో పాటు లారీలు, ఇతర వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. ఏదేని ప్రమాద జరిగితే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు..
- పెదకూరపాడు

బోర్‌వెల్ ఆఫీసులో పేలిన గ్యాస్ సిలిండర్

నాదెండ్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం శివప్రియ నగర్ సమీపంలోని విద్యాధరి బోర్‌వెల్స్ ఆఫీసులో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో ఆఫీసు గది ధ్వంసం కావటంతో పాటు కూలీల దుస్తులు, వంట సామాన్లు కాలిపోయాయి. సాయంత్రం 5గంటల సమయంలో బోర్‌వెల్స్ ఆఫీసులో ఉండే కూలీలు వంట చేస్తుండగా గ్యాస్ లీకైంది. రెగ్యులేటర్ వద్ద గ్యాస్ లీకవ్వటంతో మంటలు చెలరేగి సిలిండర్ పేలింది. చిలకలూరిపేట ఫైర్ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఎల్ఎఫ్ వెంకయ్య, సిబ్బంది రాము, పూర్ణచంద్రరరావు, రాజులు అక్కడకు చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

తాళం వేసిన గృహంలో చోరీకి యత్నం

● వరుస ఘటనలపై ప్రజల్లో ఆందోళన

శావల్యాపురం, జనవరి19 (ఆంధ్రజ్యోతి): తాళాలు వేసిన ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి చోరీకి యత్నించిన సంఘటన మండల కేంద్రమైన శావల్యాపురంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శావల్యాపురంలోని పాత సినిమాహాలు సమీపంలో నివాసముంటున్న స్టేట్‌బ్యాంక్ ఉద్యోగి హరిబాబు ఇటీవల భార్య ప్రసవించడంతో ఇంటికి తాళాలు వేసి అక్కడే ఉంటున్నాడు. విషయాన్ని పసిగట్టిన గుర్తుతెలియని వ్యక్తులు రెండు రోజుల క్రితం ఇంటి ఆవరణలోని కిటికీ అద్దాలు పగులగొట్టి గ్రిల్స్ తొలగించి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లో బీరువాని పగులగొట్టేందుకు ప్రయత్నించి విఫలమై, పిల్లలు ఆడుకొనే బొమ్మలు తీసుకొని వెళ్ళిపోయారు. ఆదివారం ఇరుగుపొరుగువారు కిటికీ అద్దం పగులగొట్టి ఉండడాన్ని గమనించి హరిబాబుకు సమాచారం అందించారు. హరిబాబు ఇంటికి వచ్చి చూసి దొంగతనానికి యత్నించినట్లు గుర్తించాడు.

రెండు నెలల క్రితం శావల్యాపురంలోని బొడ్రాయి వద్ద కూడా దురిశాల సత్యనారాయణ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి చోరీ చేశారు. పోలీసులు నిందితులను ఇంతవరకు గుర్తించలేదు. ఇంతలోనే మరో ఘటన జరగడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు చోరీలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

హోంగార్డు మృతి


హోంగార్డు అజయ్ (ఫైల్ ఫొటో)

వినుకొండ టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పలు పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న మల్లవరపు అజయ్ నాలుగు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈయన ప్రస్తుతం ఈపూరు పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. స్వగ్రామం వినుకొండ మండలం కొత్తపాలెం కావడంతో మృతదేహాన్ని కొత్తపాలెం గ్రామానికి తరలించారు. అజయ్‌కు పోలీస్ సిబ్బంది, స్నేహితులు, బంధువులు నివాళులర్పించారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

నేడు కంటి శుక్లాల పరీక్షలు

బొల్లాపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరుపాడులో శివ శక్తి లీలా అంజన్ ఫౌండేషన్ శంకర్ హాస్పటల్ వారి సౌజన్యంతో ఉదయం 9 గంటల నుంచి పంచాయతీ కార్యాలయంలో కంటి వైద్య పరీక్షలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని పేరూరుపాడు గ్రామస్థులు ఉపయోగించుకోవాలని వారు కోరారు.

పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బొడ్డుచర్ల

వినుకొండ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిత్రకారుడు బొడ్డుచర్ల ప్రసాద్ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రసాద్ అధ్యక్షుడిగా, సెక్రటరీగా కె.వందనంబాబు, జాయింట్ సెక్రటరీగా సీహెచ్ బాజి, బీరం శ్రీను, ట్రెజరర్‌గా ఎస్‌కే సైదాలతోపాటు వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.మూర్తి, ఆర్.శంకర్‌లను సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతనంగా ఎంపికైన నాయకులు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యంవీ దానయ్య, యం.పౌలురాజు, ఎస్.రాజ్‌కుమార్‌సింగ్, జి.చంద్ర, కె.నాగరాజు, పి.రామకృష్ణ, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 28 వరకు పశు వైద్య శిబిరాలు

● పశువైద్యాధికారి గణేష్‌కుమార్

శావల్యాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు పశుఆరోగ్య శిబిరాలను ఈ నెల 20 నుంచి 28వ తేదీవరకు నిర్వహించనున్నట్లు పశు వైద్యాధికారి పాలపర్తి గణేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో పశుఆరోగ్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. పశువుల్లో గర్భకోశ వ్యాధులను గుర్తించి వాటిని తక్షణమే పరిష్కరించేందుకు పశుసంవర్ధకశాఖ ద్వారా ప్రభుత్వం పశు ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ శిబిరాలను పాడి రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువుల్లో గర్భకోశ సంబంధిత వ్యాధులకు సంబంధించిన పరీక్షలుచేసి వెంటనే తగిన చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో దూడలకు, జీవాలకు నట్టల నివారణ మందులను, బొబ్బ టీకాలను కూడా వేయడం జరుగుతుందన్నారు. పాడిరైతులంతా పశు ఆరోగ్య శిబిరానికి తీసుకొచ్చి వైద్యసేవలను వినియోగించుకోవాలని కోరారు.

చిలకలూరిపేటలో కుక్కల బెడద


చిలకలూరి పేట సబ్ రిజిస్టార్ కార్యాలయం సెంటర్‌లో కుక్కల గుంపు

● బెంబేలెత్తుతున్న ప్రజలు

చిలకలూరిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట పట్టణంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పలు వీధులలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. అనేకచోట్ల కుక్కలు చిన్న పిల్లలు, పాదచారులు, ద్విచక్ర వాహనదారుల వెంట పడుతున్నాయి. కుక్కలు వెంట పడడంతో వాహనాలు పైనుంచి కిందపడి పలువురు గాయపడిన సంఘటనలు జరిగాయి. కుక్కలు వెంటపడటంతో ఒక కౌన్సిలర్ బైక్ పైనుంచి కిందపడి కాలు విరగకొట్టుకున్న సంఘటన ఇటీవల జరిగింది. కుక్కల బెడదతో దాదాపు అన్ని వార్డులలో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గత అనేక మునిసిపల్ కౌన్సిల్ సమావేశాలలో కౌన్సిలర్లు ఈ సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేదు. కుక్కల నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సజీవమైనది యోగి వేమన పద్యం

● డాక్టర్ దీవి నరసింహదీక్షిత్ ● కొండవీడుకోటలో ఘనంగా యోగి వేమన జయంతి


కొండవీడుకోటలోని యోగి వేమన విగ్రహానికి నివాళులర్పిస్తున్న దీవి నరసింహదీక్షిత్, కల్లి శివారెడ్డి తదితరులు

యడ్లపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన రచించిన పద్యాలు సజీవమైనవని, తెలుగుజాతి ఉన్నంత కాలం ప్రజల గుండెల్లో మారుమోగుతూనే ఉంటాయని సాహితీవేత్త డాక్టర్ దీవి నరసింహదీక్షిత్ అన్నారు. కొండవీడుకోటలోని యోగి వేమన మండపం వద్ద పల్నాడు అటవీశాఖ, కొండవీడు హెరిటేజ్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో యోగి వేమన జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా యోగి వేమన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నరసింహదీక్షిత్ మాట్లాడుతూ సంఘ సంస్కరణ, సమత్వ భావన, ఆత్మ తత్వబోధన కోసం ఆటవెలది ఈటెగా విసిరిన దిట్ట వేమన అన్నారు. ఆయన చెప్పిన ప్రతి పద్యం ప్రపంచ వేదికపై తెలుగు సాహిత్య వైభవానికి ఉన్న గొప్పతనాన్ని చాటుతుందన్నారు. కొండవీడు హెరిటేజ్ సొసైటీ సంయోజకులు కల్లి శివారెడ్డి మాట్లాడుతూ వేమన వంటి కవి మరొకరు లేరన్నారు. 'ఊరు కొండవీడు.. ఉనికి పశ్చిమ వీధి' అంటూ స్వయంగా తన ఊరు కొండవీడు అని చెప్పాడన్నారు. శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి మాట్లాడుతూ వేమన వెలుగుల్ని ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత సీపీ బ్రౌన్‌కు దక్కుతుందన్నారు. కొండవీడు అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ కొడాలి వెంకటేశ్వరరావు, ఎన్.జయసూర్యలు యోగి వేమన పద్యాలు నిత్యసత్యాలు అని సమాజంలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులను పద్య రూపంలో ఎంతో ఉన్నతంగా వివరించారన్నారు. అనంతరం కొండవీడు ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు ఆలపించిన వేమన పద్యాలు ఆకట్టుకున్నాయి.

వరవకట్టలో పోలీసుల తనిఖీలు


వరవకట్టలో తనిఖీ చేసేందుకు వచ్చిన పోలీసులు

నర్సరావుపేట లీగల్, జనవరి 19: ఇటీవల బాలలకు గంజాయి అలవాటు చేయించి వరవకట్టకు చెందిన సోదరులు చోరీలు చేయిస్తున్నట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఇంటింటిని జల్లెడ పట్టారు. స్థానికుల వివరాలు సేకరించి, ఆధార్ కార్డులను తనిఖీ చేశారు. చదువుకునే బాల బాలికల వివరాలు సేకరించారు. బయటివారు ఎవరైనా ఆశ్రయం పొందుతున్నారేమో అని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. బయట వ్యక్తులు నివసించడం లేదని మొదటి పట్టణ సీఐ వి.చరణ్ తెలిపారు. త్వరలో ఉన్నతాధికారులు సూచనల మేరకు వరవకట్ట వాసులకు ప్రభుత్వపరమైన సంక్షేమ కార్యక్రమాలు చట్టాలపై అవగాహన కార్యక్రమాలు, స్థానిక బాలబాలికలకు విద్యకోసం పలు సంక్షేమ కార్యక్రమాలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మొదటి పట్టణ ఎస్ఐలు రెండో పట్టణ ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వం రద్దుచేయాలి

● సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు


నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవహేళనగా మాట్లాడిన అమిత్ షా పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని చిత్రాలయ సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మోడీ, అమిత్ షాలు మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావడానికి ప్రజల మధ్య మత విద్వేషాలను రగులుస్తూ చోద్యం చూస్తున్నారని విమర్శించారు. అమిత్‌షా గో బ్యాక్, అంబేద్కర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ క్యారదర్శి వైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య, ఎస్‌కే చిన్నజాన్‌సైదా, నాగేశ్వరరావు, అంజిరెడ్డి, సుబ్బారావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా అమిత్‌షాకు వ్యతిరేకంగా నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మార్కెట్ యార్డు వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, ఏపూరి గోపాలరావు, సిలార్ మసూద్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఆంజనేయరాజు, డీ సుభాష్, గుంటుపల్లి బాలకృష్ణ, పీడీఎం నాయకుడు నల్లపాటి రామారావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా నాయకుడు కంబాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సుబ్బారాయగుప్తా, విజయకుమార్

ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఉత్సాహంగా టెన్నిస్ టోర్నమెంట్

నరసరావుపేట రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఇన్విటేషన్ టెన్నిస్ టోర్నమెంట్ ఉత్సాహంగా నిర్వహించారు. టెన్నిస్ స్పోర్ట్స్ అసోసియేషన్, శిశుమందిర్, ఆఫీసర్స్ క్లబ్ సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌కు ఐదు జిల్లాల నుంచి 138మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు కళాశాల సెక్రటరీ సుబ్బరాయగుప్తా, కళాశాల అధ్యక్షుడు విజయకుమార్ అభినందనలు తెలిపారు.

ఎన్ఎస్‌పీ కాలువల పరిశీలన

నూజెండ్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని త్రిపురాపురం మేజరును ఆదివారం ఎన్ఎస్‌పీ అధికారులు, డీసీ గంగినేని రాఘవ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌పీ కాలువల్లో మరమ్మత్తులు చేసి చివరి భూములకు నీరు ఇవ్వటమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశామ త్రిపురాపురం డీసీ చైర్మన్ గంగినేని రాఘవ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌పీ అధికారులు ప్రేమ్ కుమార్, నరసయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.


త్రిపురాపురం మేజరును పరిశీలిస్తున్న డీసీ గంగినేని రాఘవ, ఎన్ఎస్‌పీ అధికారులు

అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి విజయకుమార్ డిమాండ్

నరసరావుపేట టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నరసరావుపేట పట్టణంలోని కోటప్పకొండ రోడ్డులో ఉన్న సీపీఎం కార్యాలయంలో ఏపీ మోడల్ స్కూల్స్‌లో పనిచేసే అవుట్ సోర్సింగ్ సిబ్బంది వివిధ పార్టీలు, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఏపీ మోడల్ స్కూల్స్ అటెండర్, వాచ్‌మెన్స్ అవుట్ సోర్సింగ్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు వీ పేరయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులకు మాత్రమే మినిమమ్ టైమ్ స్కేల్ ఇచ్చి, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎంటీఎస్ ఇవ్వకుండా వదిలియడాన్ని తీవ్రంగా ఖండించారు. సీఐటీయూ కార్యదర్శి షేక్ శిలార్ మాట్లాడుతూ మోడల్ స్కూల్స్‌లో పనిచేసే అటెండర్లు, వాచ్‌మెన్‌లకు స్వీపరు పనులు తొలగించాలని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం సంయుక్త కార్యదర్శి శిఖినం చిన్న, పీడీఎం సీనియర్ నాయకుడు నల్లపాటి రామారావు, పీకేఎస్ జిల్లా కార్యదర్శి కంబాల ఏడుకొండలు, ఎస్‌కే షరీఫ్ పాషా, ఎం.అంకమ్మచౌదరి, బాలరాజు, ఎం.చిన్నయ్య, ఉయ్యాల మహేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

భరతనాట్య కళాశాల ఏర్పాటే లక్ష్యం

● డాక్టర్ పువ్వాడ ప్రతిమ


నృత్య ప్రదర్శన చేస్తున్న స్నేహ నాట్య అకాడమీ విద్యార్థులు

చిలకలూరిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలుగు నేల మీద కళావైభవ ప్రాభవాలు విరాజిల్లిన కొండవీడు కీర్తి దిగంతాలకు వ్యాపింప చేయడమే లక్ష్యంగా చిలకలూరిపేటలో త్వరలో భరతనాట్య కళాశాలను ప్రారంభించబోతున్నామని స్నేహ నాట్య అకాడమీ చైర్మన్ డాక్టర్ పువ్వాడ ప్రతిమ ఆదివారం అన్నారు. పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయం, నాగేశ్వర స్వామి దేవాలయం, శ్రీ భూనీలా రాజ్యలక్ష్మి మాత సమేత లక్ష్మీనృసింహస్వామి దేవాలయం, అంకమ్మ తల్లి దేవాలయం, ఉమా మహేశ్వర స్వామి వారి దేవాలయం, శ్రీ లక్ష్మీ పద్మావతి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణాలలో స్నేహ నాట్య అకాడమీ విద్యార్థులతో నృత్య ప్రదర్శన నిర్వహించారు. ప్రతి దేవాలయములో 30 నిమిషాల పాటు భరతనాట్యాన్ని ప్రదర్శించారు. అనంతరం వెంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో దేవాలయ పాలకవర్గం, శ్రీఆర్యవైశ్య కల్యాణ మండపం పాలకవర్గం, పట్టణ ఆర్యవైశ్య సంఘం వారు స్నేహ నృత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ ప్రతిమను, విద్యార్థినులను అభినందించి ఘనంగా సత్కరించారు. త్వరలో ఏర్పాటు చేయనున్న నాట్య కళాశాలను కళా పోషకులు, కళా ప్రియులు, కళాభిమానులైన చిలకలూరిపేట ప్రజలు ఆశీర్వదించి, ప్రోత్సహించాలని ఈ సందర్భంగా డాక్టర్ ప్రతిమ కోరారు.

బీఎస్పీ నేత కుటుంబానికి రూ.లక్ష సాయం


రామకృష్ణ కుటుంబ సభ్యులకు రూ.లక్ష చెక్కును అందజేస్తున్న బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేరెళ్ళ రాజు, నాయకులు

నూజెండ్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మరణించిన బీఎస్పీ మండల అధ్యక్షుడు పిడతల రామకృష్ణ కుటుంబాన్ని బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేరెళ్ళ రాజు పరామర్శించి కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థికసాయాన్ని ఆదివారం అందించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షుడు బూదాల బాబూరావు, వినుకొండ నియోజకవర్గ నాయకులు మాసిపోగు ఏసుబాబు, పత్రా వెంకటయ్య, ఎనబరి, వరప్రసాదు, పూనూరి జాన్సన్‌బాబు, ధూపాటి విజయ బాబు, ధూపాటి గాలెయ్య, వట్టికోటి శివప్రసాదు, గుంజరి కిషోర్‌బాబు, కే హృదయబాబు, సాతులూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఫ్లెక్సీ చించివేత

నాదెండ్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమామిళ్ళలో టీడీపీ ఫ్లెక్సీని శనివారం అర్ధరాత్రి చించివేశారు. నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలతో ఎంపీ, ఎమ్మెల్యేల ఫొటోలతో పాత బొడ్డురాయి సెంటర్‌లో ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేయగా అర్ధరాత్రి చించివేశారు. ఈ విషయమై గ్రామానికి చెందిన ఘంటా హరికృష్ణ నలుగురు వ్యక్తులు ఫ్లెక్సీని చించివేసినట్లు పోలీసులకు పిర్యాదు చేశారు.

నేటి నుంచి గ్రామాల్లో పశువులకు వైద్య పరీక్షలు

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిగడ్డ గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం పశు వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంరక్షణ లక్ష్యంగా ఉచితంగా ఏర్పాటుచేసిన పశువైద్య శిబిరాన్ని పాడిరైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా నియోజకవర్గంలో 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మండలానికి రెండు పంచాయతీల్లో పశువైద్యశిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి పశువులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ వైద్యశిబిరంను పశుపోషకులు తమ పశువులకు వైద్య పరీక్షలతోపాటు గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధినిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు పంపిణీతోపాటు వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు ఆయన తెలిపారు. శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వైద్య శిబిరాల్లో పశు వైద్యులతోపాటు పారా వెటర్నరీ సిబ్బంది, గోపాలమిత్ర, పశుసంవర్ధక సహాయకులు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.


టీడీపీ శాశ్వత సభ్యత్వ కార్డులను అందచేస్తున్న ప్రత్తిపాటి

శాశ్వత సభ్యత్వం తీసుకున్న వారికి ప్రత్తిపాటి అభినందన

చిలకలూరిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబరు 26న 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో ప్రారంభమైన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం తక్కువ సమయంలోనే కోటికి చేరడంపై శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ లక్ష రూపాయల శాశ్వత సభ్యత్వం పొందిన చిలకలూరిపేట మండల అధ్యక్షుడు జవ్వాజి మదన్‌మోహన్, నాదెండ్ల మండల అధ్యక్షుడు బండారుపల్లి సత్యం, యడ్లపాడు మండల అధ్యక్షుడు కామినేని సాయిబాబా తదితరులు పుల్లారావును ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారికి అభినందనలు తెలిపి సభ్యత్వ కార్డులు అందచేశారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, లభించే గౌరవం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. రూ.100లు చెల్లించి తీసుకునే సభ్యత్వంతో రూ.5లక్షల బీమా ప్రయోజనం లభిస్తుందన్నారు.


విరాళం చెక్కును ఆలయ ఈవో నలబోతుల మాధవీదేవికి అందజేస్తున్న దాతలు

మహంకాళి ఆలయం పునః నిర్మాణం కోసం విరాళం

ఇసప్పాలెం (నరసరావుపేట రూరల్), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసప్పాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయం పునః నిర్మాణ పనులకు దమ్మాలపాడుకు చెందిన నన్నపనేని సుబ్బారావు, భార్య నారాయణమ్మ వారి కుమారుడు సాంబశివరావు జ్ఞాపకార్థం రూ.5,01116 విరాళంను అందజేశారు. ఆలయ కార్య నిర్వాహక అధికారి నలబోతుల మాధవిదేవికి ఆదివారం ఈ మొత్తం చెక్కును అందజేశారు. ఆలయంలో మహంకాళి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా పాల్గొన్నారు. పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయం పునః నిర్మాణం కోసం విరాళం అందించిన దాతలకు ఆలయ అధికారులు, అర్చకులు అమ్మవారి ప్రసాదం అందజేశారు.


పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న గురువులను సత్కరిస్తున్న 1977 బ్యాచ్ పది విద్యార్థులు

కోలాహలంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

యడ్లపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు లూథరన్ ఉన్నత పాఠశాలలో 1976-77లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో కోలాహలంగా జరిగింది. పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు కలసి చదువుకున్న విద్యార్థులంతా కలిశారు. పాఠశాల ప్రాంగణంలో కలియ తిరుగుతూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు జోసెఫ్, వినతి, రాజారావులను ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు జోసెఫ్ మాట్లాడుతూ విద్యార్థులు తమను గుర్తు పెట్టుకుని ఆహ్వానించడం ఎంతో సంతోషం కలిగించిందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నాగండ్ల శేషగిరిరావు, ముత్తవరపు ఆంజనేయులు, రాజేశ్వరి, సుకన్య సాల్మన్‌రాజు, చాగంటి శివకోటిరెడ్డి, వైబీటీ శ్రీనివాసరావు, పి.బెంజిమన్, ఉన్నవ సాంబయ్య, ఉప్పలపాటి రాజ్యలక్ష్మి, పోపూరి రాంబాబు, రావిపాటి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా జాతీయ రహదారి

వినుకొండ టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. వినుకొండ నుంచి మార్కాపురం వెళ్ళే జాతీయ రహదారిపై పలు ప్రాంతాల్లో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకోవడంతో యువత మృత్యువాత పడుతున్నారు. ఈ నెల 13వ తేదీన మండలంలోని కొత్తపాలెం సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని 40గొర్రెల తోపాటు ఓ యువకుడు మృతిచెందిన సంఘటన జరిగింది. ఉమ్మడివరం నుంచి కొత్తపాలెం వచ్చే మార్గంలో వాగుపై హైవే అధికారులు బ్రిడ్జి నిర్మించి రోడ్డుకు ఇరువైపులా రైలింగ్‌ను నిర్మించారు. అక్కడ బ్రిడ్జిపై ఎటువంటి లైట్లు ఏర్పాటు చేయలేదు. మలుపు వద్ద గొర్రెలు రోడ్డు ప్రమాదానికి గురయ్యాయి. బస్సు మూల మలుపువద్ద ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదం చోటుచేసుకున్నట్లు ఆర్టీసీ అధికారులు ప్రాథమిక నిర్ధారణలో గుర్తించినట్లు సమాచారం. హైవే అధికారులు ప్రమాద ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, విద్యుత్‌లైట్లు ఏర్పాటుచేసి ఉంటే ప్రమాదం జరిగి ఉండేది కాదని ఆర్టీసీ అధికారులు బెబుతున్నారు. ఇదిలా ఉండగా శివాపురం సమీపంలోని పోలేరమ్మ గుడి, నడిగడ్డ అడ్డ రోడ్డు, పసుపులేరు బ్రిడ్జి మలుపుల వద్ద తరుచూ చోటుచేసుకుంటున్నా ప్రమాదాలపై హైవే అధికారులు దృష్టిసారించటం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గొర్రెలు మృతిచెందిన ప్రాంతంలో దీపాలు ఉంటే ఘోర ప్రమాదం తప్పేదని వాహనదారులు చెబుతున్నారు. హైవే అధికారులు తరుచూ ప్రమాద సంఘటన ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.